ఈనాడు
మార్కాపురం
సోమవారం 31 ఆగస్టు 2026

కోటి ఆశల జలోదయం

- వెలిగొండతో మారనున్న మార్కాపురం జిల్లా రూపురేఖలు
- మహోన్నత ఘట్టం ఆవిష్కరణ నేడే

వెలిగొండ ప్రాజెక్టు సాకారం కావడంతో పశ్చిమ ప్రకాశం ప్రాంతం ప్రకాశించనుంది. సోమవారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా ప్రాజెక్టు ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు పూర్తయిన తరుణంలో తమ భవిష్యత్తుకు ఈ రోజు మేలిమలుపుగా నిలుస్తుందని మార్కాపురం జిల్లా వాసులు ఆకాంక్షిస్తున్నారు. **ఈనాడు, ఒంగోలు**

తాగేందుకు కూడా నీళ్లు ఉండవు.. అమ్మో ప్రకాశం జిల్లానా.. అంటూ బయట ప్రాంతాల వాళ్లు ఇక్కడికి వచ్చేందుకు జంకుతారు. అక్కడ మనం బతకలేమని అనాసక్తత చూపుతారు. కనిగిరి ప్రాంతంలో తీవ్రమైన ఫ్లోరైడ్ సమస్య, యర్రగొండపాలెం ప్రాంతంలో వేయి అడుగుల దిగువకు వెళితేనే గాని నీటి చెమ్మ తగలదు. వేసవిలో గిద్దలూరు ప్రాంతంలో నీళ్లు కొనుక్కొని తాగాల్సిందే.. మార్కాపురం నీళ్లు ఎప్పుడో వస్తాయో తెలియని పరిస్థితి. మనిషి మనుగడకు కీలకమైన జలం అందుబాటులో లేక ఇక్కడి వారు దశాబ్దాలుగా వలసపోతూనే ఉన్నారు. ఒక్క కనిగిరి ప్రాంతం చూసుకొంటే 60 వేల మందికిపైగా వివిధ రాష్ట్రాల్లో పనులు చేసుకుంటున్నారు. మార్కాపురం జిల్లాలో ఏ గ్రామీణ ప్రాంతం చూసుకున్నా, ఇరవై ఏళ్ల యువకులు అంతంత మాత్రంగానే కనిపిస్తారు. ఎలాగోలా మా బతుకులు దుర్భరంగా ఈడ్చుకొచ్చాం.. మీరైనా మంచి బతుకు చూసుకోండంటూ తల్లిదండ్రులే తమ పిల్లలను ఊళ్లో ఉండనివ్వకుండా పంపించేస్తుంటారు. ఇక్కడి నీరు తాగితే అనారోగ్యం పాలవుతారని, చేతిలో పని లేకుండా ఖాళీగా కూర్చోవాలని ఊరు వదిలిపోవాలని చిన్నప్పటి నుంచి నూరిపోస్తారు. ఆ దుర్భర పరిస్థితులు పోయి మంచి భవిష్యత్తునిచ్చే రోజు రానే వచ్చింది.


విద్యుత్తు కాంతులతో క్రాస్ రెగ్యులేటర్, సుంకేశుల జలాశయం



కృష్ణమ్మ మార్పు తెచ్చేను
40 టీఎంసీల జలనిధి

కృష్ణా జలాలు కరవు నేలను తాకితే తొలుత భూగర్భ జలాలు మెరుగై బోర్లలో నీళ్లు అందుబాటులో ఉంటాయి. ఒకటి కాదు.. రెండు కాదు.. ఏకంగా 40 టీఎంసీలకు పైగా జలనిధి అందుబాటులో ఉంటే ఊహించనంత మార్పు తెస్తుంది. కిలోమీటర్ల కొద్దీ కృష్ణా జలాలు ప్రవహించి భూగర్భంలో ఫ్లోరైడ్‌ను భూస్థాపితం చేసేస్తాయి. ఫ్లోరైడ్‌తో కూడిన నీళ్లు తాగడం వల్ల పళ్లు ఊడిపోవడం, కాళ్లు వంకరపోవడం, వెన్నెముక ఒంగిపోవడం, ఎముకలు పలచబడి ఎంతోమంది బాధపడుతుండగా, ఇప్పుడు ఆ సమస్య దూరమై ప్రజలకు రోగాల బాధతప్పుతుందని మార్కాపురం ప్రభుత్వ వైద్యశాల పర్యవేక్షకులు రామచంద్రరావు పేర్కొన్నారు. ప్రజలు ఆరోగ్యంగా ఉండి, ఆయుః ప్రమాణాలు పెరిగితే మరింత ఉత్పాదకత సాధిస్తారని, రానున్న పదేళ్లలో మార్కాపురం రూపురేఖలు మారిపోతాయని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు.


క్రాస్ రెగ్యులేటర్ వద్ద సెల్ఫీ దిగుతున్న మహిళలు


ఫీడర్ కాలువలో పారుతున్న కృష్ణా జలాలు

ఇక ఉద్యానమే

పశ్చిమ ప్రాంతంలో విస్తారమైన నేలలున్నా, వర్షం కురిస్తే పంట లేకుంటే మంట అన్నట్లు సాగుకు పెట్టుబడి పెట్టి రైతులు ఎంతో నష్టపోతున్నారు. ఇప్పుడు నీరు కాలువల ద్వారా గాని, బోర్ల ద్వారా గాని పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే పంటలు పండటమే కాదు.. దిగుబడులు పెరిగి ఆదాయాలు పెరుగుతాయి. ఇప్పటికే ప్రభుత్వం 70 వేల హెక్టార్లలో ఉద్యాన పంటలు సాగు ద్వారా రైతుల ఆదాయం పెంచాలని ప్రయత్నం చేస్తుంది. ఒకవైపు వెలిగొండ నుంచి కృష్ణా జలాలు, మరోవైపు బెంగళూరు జాతీయ రహదారి అందుబాటులోకి రావడంతో ఉద్యాన పంటల ఎగుమతుల ద్వారా ఇక్కడి రైతు నిజంగా రాజు కానున్నాడనే చెప్పాలి. ఉద్యాన పంటల విస్తీర్ణం పెరిగితే ఆహార శుద్ధి పరిశ్రమలు ఏర్పాటైతే రైతుకు అదనపు ఆదాయం సమకూరుతుందని ఉద్యాన అధికారి గోపిచంద్ అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రాంతంలో ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయనడంలో ఎలాంటి సందేహం లేదన్నారు.

త్వరితగతిన అభివృద్ధి

జలవనరులు అందుబాటులోకి వచ్చినందున మార్కాపురం జిల్లాకు తిరుగే లేదని విద్యావేత్త కె.మధుసూదన్ పేర్కొన్నారు. పంటలతో ఆదాయం వృద్ధి చెంది, రానున్న ఐదేళ్లలో మార్కాపురం జిల్లా త్వరితగతిన అభివృద్ధి చెందుతుందన్నారు. నీరు అందుబాటులో ఉంటే పరిశ్రమల స్థాపనకు ముందుకొస్తారు. పారిశ్రామికీకరణతో సేవా రంగాలు వృద్ధి చెందిన మాదిరి భవిష్యత్తులో వెలిగొండ ఈ ప్రాంత రూపరేఖలను మార్చడంలో ఎలాంటి సందేహం లేదనే అభిప్రాయం వివిధ రంగాలకు చెందిన నిపుణులు వ్యక్తం చేస్తున్నారు.

అందరి చూపు.. వెలిగొండ వైపే..

- నలుమూలల నుంచి తరలిరానున్న జనం
- ముఖ్యమంత్రి పర్యటనకు సర్వం సన్నద్ధం

ఈనాడు, ఒంగోలు

ఆదివారం మధ్యాహ్నం.. 2.54 నిమిషాలు బిరబిరా కృష్ణమ్మ పశ్చిమ ప్రకాశాన పరుగులెత్తింది.. ఏళ్ల నిరీక్షణ ఎట్టకేలకు ఫలించిందని పశ్చిమ ప్రకాశం వాసులు ఆనందానికి లోనయ్యారు. నిమిషాల వ్యవధిలో ఈ దృశ్యాలు సెల్‌ఫోన్లలో చక్కర్లు కొట్టడంతో ఒకింత ఉద్వేగానికి లోనయ్యారు. కొంతమంది ఫీడర్ కెనాల్ వద్దకు వచ్చి సెల్ఫీలు తీసుకున్నారు. సోమవారం వెలిగొండ ప్రాజెక్టు ప్రారంభోత్సవానికి దాదాపు లక్ష మంది వరకు వచ్చే అవకాశం ఉన్నందున అధికార యంత్రాంగం భారీ ఏర్పాట్లు చేసింది.

వెలిగొండ సొరంగం పనులు పూర్తయి ట్రయల్ రన్ నిర్వహణకు ఇంజినీర్లు అన్ని ఏర్పాట్లు చేశారు. ఏమైనా అవాంతరాలు ఎదురవుతాయా.. కొంత సందేహం.. కాని దానిని పటాపంచలు చేస్తూ కృష్ణమ్మ సొరంగాలు దాటి కరవు సీమను తాకడంతో అంతటా సంతోషం నెలకొంది. సీఎం చంద్రబాబు నల్లమలసాగర్‌కు నీటిని విడుదల చేసే హెడ్ రెగ్యులేటర్ వద్ద నీళ్లు పరవళ్లు తొక్కాయి. అందరూ కేరింతలు కొట్టారు. మంత్రి డోలా శ్రీబాలావీరాంజనేయస్వామి, ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి ఉద్వేగానికి లోనవడంతో ఆనంద బాష్పాలు రాలాయి. సీఎం ఆవిష్కరించే పైలాన్ పనులు పూర్తిచేశారు. అక్కడే బాలికలతో నృత్య ప్రదర్శనకు ఏర్పాట్లు చేశారు. ప్రత్యేక చీరలు ధరించిన మహిళలు, వెలిగొండ ఆయకట్టు రైతులు సీఎంతో కలిసి సందడి చేయనున్నారు. పూజలు చేసిన అనంతరం కృష్ణమ్మకు జలహారతి ఇవ్వనున్నారు. సీఎం పర్యటనకు సంబంధించి ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ట్రయల్ రన్ నిర్వహించారు. వేయికి పైగా ఏర్పాటు చేసిన బస్సుల్లో 50 వేల మంది వరకు రానున్నారు. ఇతరేతర వాహనాలు, బైకుల్లో వచ్చిన వారికి సభా ప్రాంగణం సమీపంలో పార్కింగ్ ఏర్పాటు చేశారు.


ఫీడర్ కాలువలో కృష్ణా జలాల ప్రవాహాన్ని చూస్తున్న వృద్ధులు, మహిళలు

దోర్నాలలోనే మంత్రులు మకాం

సీఎం పర్యటన ఏర్పాట్లపై మంత్రులు నిమ్మల రామానాయుడు, నారాయణ రంగంలోకి దిగి పనులు పరుగులెత్తించారు. ఎమ్మెల్యేలతో కమిటీలు ఏర్పాటు చేసి బాధ్యతలు అప్పగించారు. ఆదివారం మంత్రులు స్వామి, గొట్టిపాటి, పార్థసారథి సీఎం పర్యటనకు సంబంధించి ఏర్పాట్లను పరిశీలించారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు ఇక్కడే మకాం వేసి రాత్రి సమయంలో కూడా పనులు పర్యవేక్షించారు.


దోర్నాల బస్టాండు ఆవరణలో ఆదివారం రాత్రి వెలిగొండ ప్రాజెక్టుపై డ్రోన్లతో నిర్వహించిన లేజర్‌షోను ప్రజలతోపాటు వీక్షిస్తున్న మంత్రి పార్థసారథి


గిద్దలూరులో అంకాలమ్మకు బోనాలు సమర్పించేందుకు మహిళలతో కలిసి ప్రదర్శనగా వెళ్తున్న ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి



వెలిగొండ ప్రాజెక్టు నీటి విడుదల నమూనా చిత్రపటం వద్ద మార్కాపురం మండలం బోడపాడు పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు


గంటవానిపల్లిలో ముఖ్యమంత్రి సభ ప్రాంగణంలో సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శనకు సిద్ధమైన వేదిక



(c) eenadu

ప్రత్యేక రంగు చీరలతో మహిళల జలహారతి


మహిళలకు అందించే చీరలు

యర్రగొండపాలెం, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సోమవారం వెలిగొండ ప్రాజెక్టును ప్రారంభించనుండడంతో దానికి జిల్లాకు రానున్నారు. ఫీడర్ కెనాల్ వద్ద నీటిని వదిలి జలహారతి ఇస్తారు. ఈ కార్యక్రమానికి దాదాపు రెండు వేల మంది మహిళలను ప్రత్యేకంగా ఆహ్వానించారు. నియోజకవర్గ తెదేపా ఇన్‌ఛార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు ఆధ్వర్యంలో పసుపు, ఎరుపు రంగు చీరలు పంపిణీ చేశారు. సీఎం నిర్వహించే కృష్ణమ్మకు జలహారతిలో వీరందరూ పాల్గొని ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నారు. ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి చిరకాలం గుర్తుండిపోయేలా అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు.

బోడపాడు పాఠశాలలో 'వెలిగొండ' సందడి

మార్కాపురం (గ్రామీణం), న్యూస్‌టుడే: ఉమ్మడి జిల్లా ప్రజల మూడు దశాబ్దాల కల, సాగునీటి కల సాకారం కానున్న వేళ, సోమవారం జరిగే పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని బోడపాడు ప్రాథమిక పాఠశాలలో ఆదివారం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. వెలిగొండ ప్రాజెక్టు ప్రాధాన్యం, నల్లమలసాగర్‌కు కృష్ణా జలాల చేరిక, తద్వారా ఈ ప్రాంతానికి కలిగే ప్రయోజనాలపై ఉపాధ్యాయుడు ఆత్మ శ్రీను విద్యార్థులకు అవగాహన కల్పించారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన వెలిగొండ ప్రాజెక్టు నమూనా చిత్రపటాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. చదువుతో పాటు ఈ ప్రాంత అభివృద్ధి, సాగునీటి ప్రాజెక్టుల ప్రాధాన్యంపై విద్యార్థుల్లో అవగాహన పెంపొందించడమే కార్యక్రమం ఉద్దేశమని ప్రధానోపాధ్యాయుడు ఎం.జాకబ్ తెలిపారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రైతుల మదిలో ఆశల పరవళ్లు

● కృష్ణా జలాల విడుదల నేపథ్యంలో హర్షం

నల్లమల సాగర్‌కు కృష్ణా జలాలను ముఖ్యమంత్రి చంద్రబాబు సోమవారం విడుదల చేయనుండటంతో ఈ ప్రాంత రూపురేఖలు మారుతాయని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ప్రాజెక్టు మొదటి దశలో 1.19 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుంది. తీగలేరు కాలువ ద్వారా 62 వేల ఎకరాలు, గొట్టిపడియ కాలువ కింద 9,500 ఎకరాలకు సాగునీరు అందనుంది... 4 లక్షల మందికి తాగునీరు తక్షణమే అందనుంది. ఎడారిగా మారిన బీళ్లు పచ్చని పంట పొలాలుగా అలరారనున్నాయి.

-న్యూస్‌టుడే, అర్ధవీడు, కంభం

కళ్లారా చూస్తానని అనుకోలేదు



నాకు 5 ఎకరాల భూమి ఉంది. మరో 3 ఎకరాలు కౌలుకు చేస్తున్నా. రెండు డీప్ బోర్లు వేసుకుని ఏదొకటి ఒకపైరు సాగు చేస్తున్నా. అయితే నా చిన్నతనంలో వెలిగొండ ప్రాజెక్టుకు చంద్రబాబు శంకుస్థాపన చేశారు. మా పొలాలు సస్యశ్యామలం అవుతాయని మా పెద్దలు అప్పుడే సంతోషపడ్డారు. నీ హయాంలో వెలిగొండ జలాలు వస్తాయని... ఏదైతే మూడు పైర్లు పండించుకుని బతకమనేవారు. కానీ గత పాలనలో నీళ్లు లేకుండా ప్రాజెక్టును ప్రారంభించడంతో ఆ నీళ్లు రావని అనుకున్నా. కానీ ఇప్పుడు కళ్లారా చూస్తున్నాం. సొరంగాల ద్వారా ఆదివారం ఫీడర్ కాలువకు వదలడం చూశాం. రాబోయే రోజుల్లో ఈ నీరు మా పొలాలకు చేరుతుందని సంతోషంగా ఉంది.

-టి.శ్రీనివాసులు, రైతు, నేకునాంబాద్, బేస్తవారపేట మండలం

కాకర్ల మరో కోనసీమ కానుంది



వెలిగొండ ప్రాజెక్టు కాకర్ల అనుకున్న దిగువన 6 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. సకాలంలో డీప్ బోరుతో నీరందక భూగర్భజలాలు అడుగంటి పంటను కాపాడుకోలేక నానా కష్టాలు పడేవాళ్లం. దానికి తోడు ఫ్లోరైడ్ శాతం కూడా ఎక్కువగా ఉండటంతో పెద్దగా దిగుబడులు వచ్చేవి కావు. అయితే అనుకున్న వెలిగొండ జలాలు చేరితే మా బోర్లకు నీరు పుష్కలంగా వస్తుంది. మంచి దిగుబడులు సాధించవచ్చు. 30 ఏళ్లుగా ప్రాజెక్టు పనులు ఎప్పుడు పూర్తవుతాయా అని ఎదురు చూస్తున్నా. చివరకు పనులు పూర్తి చేసుకుని నేడు చంద్రబాబు ప్రారంభోత్సవానికి రానుండటం ఆనందంగా ఉంది. కాకర్ల మరో కోనసీమ కానుంది.

-ఎం.కోటిరెడ్డి, రైతు, కాకర్ల, అర్ధవీడు మండలం

కల నెరవేరుతోంది



'నా జీవిత కాలంలో వెలిగొండ ప్రాజెక్టుకు నీరు వస్తుందనుకోలేదు. ఎన్నో ఏళ్ల ఎదురుచూపులు ఫలిస్తున్నాయి. సీఎం చంద్రబాబు కృషితోనే ఇది సాకారమవుతోంది. మా గ్రామం వద్ద రిజర్వాయర్ నిర్మించారు. దాంట్లోకి నీరు వస్తే మా ఊరితో పాటు చుట్టపక్కల గ్రామాల్లోనూ భూగర్భ జలాలు పెరుగుతాయి. దాని నుంచి మా గ్రామ చెరువుకు నీరు వస్తుంది. మాగాణి పొలంతో పాటుగా, రేగడి భూమికి సాగు జలాలు వచ్చే అవకాశం ఉంటుంది. కృష్ణా జలాలు వస్తే ఫ్లోరైడ్ సమస్య తగ్గుతుంది. మంచినీరు వస్తుంది'

- పుట్టా చిన్న సుబ్బయ్య, రైతు, తురిమెళ్ల

ఎదురుచూపు.. ఉద్వేగం.. ఆనందం

● ట్రయల్ రన్‌లో ప్రజల పరిస్థితి

పెద్దదోర్నాల, న్యూస్‌టుడే: పూలసుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు జంట సొరంగాల నుంచి కృష్ణా జలాలు ఫీడర్ కాలువకు చేరడంతో అక్కడే ఉన్న ఇంజినీరింగ్ అధికారులు, ప్రజా ప్రతినిధులు, ప్రజలు ఆనందంలో మునిగిపోయారు. వెలిగొండ ప్రాజెక్టులోకి కృష్ణా జలాలు పారించేందుకు ఆదివారం ట్రయల్ రన్ చేశారు. ఉదయం నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు కృష్ణా జలాలను చూసేందుకు ఎదురు చూశారు. నీరు రాగానే యువత కేకలు వేస్తూ సంతోషాన్ని పంచుకున్నారు. రెండో సొరంగం ముఖద్వారం, రెండు సొరంగాలు ఫీడర్ కాలువలో కలిసే ప్రదేశం, సీఎం ముఖ్యమంత్రి హారతి ఇచ్చే ప్రదేశంలో నీరు ప్రవహిస్తుంటే ఫొటోలు, సెల్ఫీలు దిగేందుకు ప్రజాప్రతినిధులు, మహిళలు, చిన్నారులు ఆసక్తి చూపారు. సొరంగాల్లో నీటి ప్రవాహాన్ని చూసి మా కష్టం ఫలించిందని ఇంజినీర్లు, కార్మికులు ఒకరినొకరు చేతులు కలుపుతూ ఆనందాన్ని పంచుకున్నారు.

సీఎం పర్యటన దృష్ట్యా ట్రాఫిక్ మళ్లింపు


డీఎస్పీ నాగరాజు

మార్కాపురం, న్యూస్‌టుడే: సీఎం చంద్రబాబునాయుడు మార్కాపురం జిల్లాలో ఈ నెల 31వ తేదీన పర్యటించనున్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలోని పలు ప్రాంతాల్లో నుంచి ట్రాఫిక్‌ను మళ్లించినట్లు పోలీసు అధికారులు చెప్పారు. ఆదివారం స్థానిక డీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో డీఎస్పీ యు.నాగరాజు మాట్లాడుతూ ఈ నెల 31న ఉదయం 5 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు వాహనాల దారి మళ్లింపు ఉంటుందన్నారు. నాలుగు మార్గాల్లో ట్రాఫిక్‌ను మార్పు చేసినట్లు తెలిపారు. నాలుగు మార్గాల్లో వాహనదారులు రాకపోకలు సాగించాలని కోరారు. పోలీసు అధికారులకు సహకరించాలని డీఎస్పీ కోరారు. గుంటూరు నుంచి ఆత్మకూరు వెళ్లే వాహనదారులు గిద్దలూరు మీదుగా నంద్యాల వైపు వెళ్లి, అక్కడి నుంచి ఆత్మకూరు వెళ్లాలన్నారు. దేవరాజుగట్టు నుంచి చిన్న దోర్నాల వైపు వెళ్లే వాహనదారులకు రహదారి నిషేధించినట్లు చెప్పారు. శ్రీశైలం నుంచి వచ్చే, వెళ్లే వాహనాలు దోర్నాల టౌన్‌లోకి వెళ్లకుండా బైపాస్ రోడ్డు నుంచి రాకపోకలు జరపాలన్నారు. ఆత్మకూరు వైపు వెళ్లే వాహనదారులు గిద్దలూరు మీదుగా నంద్యాల వైపు వెళ్లి, అక్కడ నుంచి ఆత్మకూరు వైపు వెళ్లాలని సూచించారు. ఆత్మకూరు నుంచి గుంటూరు, శ్రీశైలం వైపు వెళ్లే వాహనదారులు నంద్యాల నుంచి గిద్దలూరు మీదుగా వెళ్లాలని సూచించారు.

నయన మనోహరం.. ముద్దసానమ్మ రూపం



మార్కాపురం మండలంలోని జమ్మనపల్లి-కోలభీమునిపాడు గ్రామ శివారుల్లో వెలసిన శ్రీముద్దసానమ్మ దేవస్థానంలో శ్రావణ మాస ఆదివారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు అమ్మవారిని రంగురంగుల పుష్పాలతో విశేష అలంకరణలో భక్తులకు దర్శనం గావించారు. పట్టణ, సమీప గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. – న్యూస్‌టుడే, మార్కాపురం గ్రామీణం

పోలీసు పహారాలో సీపీఎం కార్యాలయం

మార్కాపురం, న్యూస్‌టుడే: వెలిగొండ ప్రాజెక్టు ప్రారంభోత్సవానికి సీఎం చంద్రబాబు నాయుడు ఈ నెల 31వ తేదీన పర్యటిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం స్థానిక పూలసుబ్బయ్య వీధిలోని సీపీఎం కార్యాలయంపై పోలీస్ పహారా పెరిగింది. ఉదయం 5 గంటలకే పోలీసులు కార్యాలయానికి చేరుకుని నాయకులను బయటకు వెళ్లకుండా అడ్డుకున్నారు. బైండోవర్ చేశారు. వారితో నోటీసులపై సంతకాలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి దగ్గుపాటి సోమయ్య మాట్లాడుతూ 30 ఏళ్లుగా ప్రాజెక్టును పాలక పార్టీలు నిర్లక్ష్యం చేశాయన్నారు. ప్రాజెక్టును పూర్తి చేయడానికి, నిర్వాసితుల సమస్యల కోసం కేసులు, జైళ్లను లెక్కచేయకుండా అనేక ఉద్యమాలను నడిపించినట్లు చెప్పారు. ప్రాజెక్టు కోసం కమ్యూనిస్టులు అనేక సంవత్సరాలుగా పోరాటాలు చేసిన ఘనత వారికే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు డి.కె.ఎం.రఫీ, పి.రూబెన్, గుమ్మా బాలనాగయ్య, కె.మాల్యాద్రి, ఏనుగుల సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఆపన్నహస్తం అందించడమే 'మానవత' లక్ష్యం


ర్యాలీలో పాల్గొన్న సేవా సంస్థ ప్రతినిధులు

పొదిలి, న్యూస్‌టుడే: సమాజంలోని పేదలకు ఆపన్నహస్తం అందించి శాంతి, ప్రేమ, ఆనందం పంచాలన్నదే మానవత స్వచ్ఛంద సేవా సంస్థ లక్ష్యమని వ్యవస్థాపకుడు ఎన్.రామచంద్రా రెడ్డి అన్నారు. ఉమ్మడి ప్రకాశం జిల్లా మానవత శాఖల ఆధ్వర్యంలో ప్రపంచ శాంతిని కాంక్షిస్తూ పొదిలిలో ఆదివారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం కార్యాలయంలో జరిగిన జిల్లా నూతన కార్యవర్గ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కులమతాలు, పార్టీలకు అతీతంగా మానవతా సేవా సంస్థ రాష్ట్ర వ్యాప్తంగా 146 శాఖల ద్వారా సేవలందిస్తుందన్నారు. మానవతావాదులు, దాతలు ముందుకొచ్చి సంస్థ చేపట్టే సేవా కార్యక్రమాల్లో పాల్గొంటున్నారని చెప్పారు. పొదిలిశాఖ చేస్తున్న సేవా కార్యక్రమాలు రాష్ట్రానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని కొనియాడారు. ఏపీఆర్ గ్రూప్స్ అధినేత ఆవుల క్రిష్టారెడ్డి ఈ ఏడాది 105 మంది పేదలకు ఒక్కొక్కరికీ రూ.అయిదు వేల నిత్యవసరాలను అందించడం అభినందనీయమన్నారు. జిల్లా కార్యవర్గం చేత క్రిష్టారెడ్డి ప్రమాణ స్వీకారం చేయించారు. అధ్యక్షుడిగా ఎం.పార్థసారధి, ప్రధాన కార్యదర్శిగా ఎం.యేసోబు, కోశాధికారిగా ఎం.నరసింహారావు, ఉపాధ్యక్షుడిగా కె.రామిరెడ్డి, సంయుక్త కార్యదర్శిగా జి.వేణు, కార్యనిర్వహణ సభ్యులుగా డి.శ్రావణ్‌కుమార్, ఎం.సత్యనారాయణ, టి.రామిరెడ్డి, కె.చెన్నకేశవులు, ఉమ్మడి ప్రకాశం జిల్లా మహిళా అధ్యక్షురాలిగా వనజాక్షి ప్రమాణం చేశారు. పొదిలి మానవతశాఖ ఛైర్మన్ కె.నారాయణబాబు, మాజీ అధ్యక్షుడు కె.యల్లమందారెడ్డి, కన్వీనర్ కె.సుబ్బారెడ్డి, అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎస్.చిరంజీవి, వెంకటకృష్ణారావు, స్థలదాత వెలిశెట్టి వెంకటేశ్వర్లు, కోశాధికారి బి.అశోక్, మానవతాశాఖ ప్రతినిధులు పాల్గొన్నారు.


శ్రీనివాసరావును సన్మానిస్తున్న అధికార భాషా సంఘం ప్రతినిధులు

భాషాభివృద్ధికి 'నాయని' సేవలు చిరస్మరణీయం

పొదిలి, న్యూస్‌టుడే: ఒంగోలులో ఆదివారం జరిగిన ప్రకాశం జిల్లా తెలుగు వెలుగు విశిష్ట సాహిత్య సదస్సులో పొదిలి బిట్స్ విద్యా సంస్థల కరస్పాండెంట్ బి.శ్రీనివాసరావు తెలుగు భాషా, రచన, సాహిత్యంపై ప్రసంగించారు. నవ్య భావ కవితా యుగశేఖరుడు, స్వాతంత్ర సమర యోధులు నాయని సుబ్బారావు సాహిత్యం, రచనలపై చర్చించారు. ఈ సందర్భంగా అధికార భాషా సంఘం అధ్యక్షులు పి.త్రివిక్రమరావు, ఆంధ్ర సారస్వత పరిషత్ అధ్యక్షులు గజల్ శ్రీనివాసరావు బెల్లంకొండ శ్రీనివాసరావును ఘనంగా సన్మానించారు. జ్ఞాపికలు అందజేశారు. భాష మనుగడ సాగించాలంటే సాహితీవేత్తలు అవసరమని పలువురు కొనియాడారు.

విద్యార్థులకు ఆలస్యంగా అల్పాహారం

● మంత్రి ఆగ్రహం


వసతి గృహంలో కింద కూర్చుని మాట్లాడుతున్న మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి

మార్కాపురం, న్యూస్‌టుడే: మార్కాపురం పట్టణంలోని సాంఘిక సంక్షేమ శాఖ బాలికల వసతి గృహంలో బాలికలకు ఉదయం అల్పాహారం ఆలస్యంగా పెట్టడంపై రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం మార్కాపురం- తర్లుపాడు రోడ్డులోని ఎస్సీ బాలికల వసతి గృహాన్ని మంత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన నేరుగా వెళ్లి విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వసతి గృహంలో అందుతున్న పౌష్టికాహారంతో పాటు సౌకర్యాలపై ఆరా తీశారు. కింద కూర్చుని సమస్యలను చెప్పాలని కోరారు. దీంతో విద్యార్థులు మంత్రి దృష్టికి పలు సమస్యలను తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు అల్పాహారం ఎందుకు ఆలస్యంగా పెట్టారని అధికారులను ప్రశ్నించారు. వసతి గృహంలో పారిశుద్ధ్య నిర్వహణ, విద్యార్థులకు సకాలంలో ఏకరూప దుస్తులతో పాటు ఇతర సామగ్రి ఇవ్వకపోవడంపై వసతి గృహ అధికారి, డీడీపై అసహనం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సాంఘిక సంక్షేమశాఖ అధికారి లక్ష్మానాయక్, అధికారులు పాల్గొన్నారు.


బాలికల ఖోఖో జట్టుకు ఎంపికైన క్రీడాకారిణులు

బాలికల ఖోఖో జట్టు ఎంపిక

చీమకుర్తి, న్యూస్‌టుడే: ఉమ్మడి ప్రకాశం జిల్లా ఖోఖో సంఘం ఆధ్వర్యంలో జిల్లా జూనియర్ బాలికల ఖోఖో జట్టును చీమకుర్తిలో ఆదివారం ఎంపిక చేశారు. సుమారు 60 మంది క్రీడాకారిణులు హాజరయ్యారు. జిల్లా జట్టుకు ఎంపికైన వారు ఎన్టీఆర్ జిల్లా కంచికచర్లలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొననున్నారు. జిల్లా సంఘం అధ్యక్ష కార్యదర్శులు వసంత రఘుబాబు, కరిచేటి హనుమంతరావు, పీడీ మండవ సౌజన్య పర్యవేక్షించారు. సీపీఎస్ ప్రధానోపాధ్యాయుడు రామాంజనేయులు, పీడీ రామకృష్ణ, శ్రీహరి, మురళి, వెంకట్ పాల్గొన్నారు.

నేడు పోలీసు పీజీఆర్ఎస్ రద్దు

ఒంగోలు నేరవిభాగం, న్యూస్‌టుడే: జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)ను ఈ వారం తాత్కాలికంగా రద్దు చేసినట్లు జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్‌రాజు తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సోమవారం వెలిగొండ ప్రాజెక్టును ప్రారంభించనున్నారు. ఈ నేపథ్యంలో పోలీసు యంత్రాంగం బందోబస్తు విధుల్లో నిమగ్నమై ఉండటంతో సోమవారం పీజీఆర్ఎస్‌ను రద్దు చేసినట్లు ఎస్పీ తెలిపారు.

నీట్ పీజీ పరీక్షకు 426 మంది హాజరు

ఒంగోలు కలెక్టరేట్, న్యూస్‌టుడే: ఒంగోలులోని మూడు కేంద్రాల్లో ఆదివారం నిర్వహించిన నీట్ పీజీ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ఒంగోలు సమీపంలోని రైజ్ కృష్ణసాయి కళాశాల, మామిడిపాలెం జంక్షన్‌లోని నేషనల్ కౌన్సిల్ ఫర్ ది చర్చ్ సోషల్ యాక్షన్ ఇండియా, బ్రిలియంట్ కంప్యూటర్ ఎడ్యుకేషన్ సంస్థలోని కేంద్రాల్లో ఉదయం 9 నుంచి 12.30 గంటల వరకు ఆన్‌లైన్ విధానంలో పరీక్షను నిర్వహించారు. మొత్తం 434 మంది అభ్యర్థులకు గానూ, 426 మంది హాజరయ్యారు.

ప్రతిరోజు స్వర్ణ గ్రామ, వార్డుల్లో పీజీఆర్ఎస్

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని స్వర్ణ గ్రామ, వార్డు కార్యాలయాల్లో సోమవారం నుంచి ప్రతిరోజు మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పీజీఆర్ఎస్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు జిల్లా స్వర్ణ గ్రామ, వార్డు అధికారి ఎం.వెంకటేశ్వరరావు తెలిపారు. సదరు కార్యాలయాల్లో సిబ్బంది అందుబాటులో ఉండటం లేదంటూ ఐవీఆర్ఎస్ ద్వారా పలువురు అసంతృప్తి వ్యక్తం చేసిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. కలెక్టరేట్‌కు రావాల్సిన పని లేకుండా స్థానికంగానే అర్జీలు ఇవ్వడం ద్వారా వాటిని పరిష్కరిస్తారని ఆయన ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

సాగర్ నీరొచ్చింది.. దాహార్తి తీరనుంది


85/3వ మైలు గేట్ల నుంచి జిల్లాలోకి ప్రవేశించిన సాగర్ జలాలు

త్రిపురాంతకం గ్రామీణం, న్యూస్‌టుడే: ఉమ్మడి ప్రకాశం జిల్లా తాగునీటి అవసరాల కోసం విడుదలైన సాగర్ జలాలు ఆదివారం త్రిపురాంతకం ఎన్నెస్పీ సబ్ డివిజన్‌లోకి ప్రవేశించాయి. తీవ్ర వర్షాభావంతో తాగునీటి ఎద్దడితో అల్లాడుతున్న మార్కాపురం, ప్రకాశం జిల్లాల ప్రజల దాహార్తి తీరనుంది.

సోమవారం కల్లా కురిచేడు సబ్ డివిజన్‌లోకి

మూడు రోజుల క్రితం బుగ్గవాగు వద్ద జలాలు విడుదల చేయగా శనివారం పల్నాడు జిల్లా చేజర్ల సమీపంలోని 57/2వ మైలు వద్దకు వచ్చాయి. అక్కడ షట్టర్లు ఎత్తడంతో ఆదివారం పల్నాడు-మార్కాపురం జిల్లాల సరిహద్దు 85/3వ మైలు నుంచి జిల్లాలోకి తొలుత 475 క్యూసెక్కుల సాగర్ జలాలు ప్రవేశించాయి. సాయంత్రానికల్లా ఆరడుగుల మేర ప్రవాహం 1,500 క్యూసెక్కులకు పెరిగింది. సోమవారం కల్లా త్రిపురాంతకం ఎన్నెస్పీ సబ్ డివిజన్ దాటి కురిచేడు సబ్ డివిజన్‌లోకి ప్రవేశిస్తాయని త్రిపురాంతకం ఎన్నెస్పీ సబ్ డివిజన్ డీఈఈ యు.విజయలక్ష్మి తెలిపారు. సాగర్ కుడి ప్రధాన కాలువ ద్వారా ఉమ్మడి జిల్లాకు రెండు వేల క్యూసెక్కుల చొప్పున 15 రోజుల పాటు సాగర్ జలాలు సరఫరా అవుతాయని ఒంగోలు ఎన్నెస్పీ ఇన్‌ఛార్జి ఎస్ఈ రవికుమర్ తెలిపారు.

అడుగంటిన తాగునీటి జలాశయాలు

కృష్ణానది ఎగువ పరివాహక ప్రాంతాల్లో అరకొర వానలు కురవడంతో వచ్చిన కొద్దిపాటి వరదకు శ్రీశైలం జలాశయం సైతం నిండలేదు. ఫలితంగా నాగార్జున సాగర్‌కు నీటి చేరిక నిలిచిపోవడంతో సాగునీటికి నోచుకోలేదు. ఖరీఫ్‌లోనూ వాన జాడ లేక, ఎండల తీవ్రత పెరగడంతో చెరువులు అడుగంటాయి. కొన్ని చెరువుల్లో 40 శాతం నీరుండగా, మరికొన్నింట్లో 25 శాతానికి మించి లేవు.

● ఎల్‌నినో తీవ్రత కొనసాగే అవకాశం ఉన్నందున రబీ సీజన్ వస్తున్నా చినుకు జాడ లేకపోవడంతో చెరువులు పూర్తిగా అడుగంటే ముప్పు ఉంది. 1.5 టీఎంసీల నీరు నిల్వ ఉండాల్సిన రామతీర్థం జలాశయంలో 0.16 నీరు ఉంది. డెడ్ స్టోరేజీకి చేరిన రామతీర్థంతో పాటు సాగర్ ప్రధాన కాలువపై ఉన్న తాగునీటి నిల్వ జలాశయాలను నీటితో నింపేందుకు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు చర్యలు చేపట్టారు.

ద్విచక్ర వాహనం బోల్తాపడి వ్యక్తి దుర్మరణం

సీతారామపురం, న్యూస్‌టుడే: ద్విచక్ర వాహనం అదుపుతప్పి బోల్తా పడటంతో ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా సీతారామపురం మండలంలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు... మార్కాపురం జిల్లా సీఎస్‌పురం మండలం నల్లమడుగుల ఎస్సీకాలనీకి చెందిన గుడిగుట్ల నారాయణ(47) బేల్దారీ మేస్త్రీగా పని చేస్తుంటారు. ఆయన భార్య అంగన్‌వాడీ కార్యకర్తగా గ్రామంలో పనిచేస్తున్నారు. వారికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమార్తె వైఎస్సార్ కడప జిల్లా పోరుమామిళ్ల కేజీబీవీలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. కుమార్తెను ఇంటి వద్ద నుంచి ద్విచక్ర వాహనంపై పోరుమామిళ్లకు తీసుకెళ్లి పాఠశాలలో వదిలిపెట్టి స్వగ్రామానికి వస్తుండగా సీతారామపురం పంచాయతీ నారాయణప్పపేట వద్ద ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో నారయణ తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే మృతిచెందారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకటరాజేష్ తెలిపారు.

యువకుల మృతిపై బంధువుల ఆందోళన


పవన్‌కుమార్‌రెడ్డి


జస్వంత్‌కుమార్‌రెడ్డి

కడప నేరవార్తలు, న్యూస్‌టుడే: కడప శివారులోని సింగ్‌పూర్ టౌన్‌షిప్ వద్ద శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో పవన్‌కుమార్‌రెడ్డి(21), జస్వంత్‌కుమార్ రెడ్డి(22)లు మృతి చెందారు. మార్కాపురం జిల్లా, పుల్లలచెరువు మండలం ఉమ్మడివరం గ్రామానికి చెందిన పవన్‌కుమార్‌రెడ్డి నగరంలోని ఎస్వీ ఇంజినీరింగ్ కళాశాలలో ఇంజినీరింగ్ చదివేవారు. జస్వంత్‌కుమార్‌రెడ్డి హోమియోపతి కళాశాలలో ఆయుర్వేద వైద్యవృత్తినభ్యసించేవారు. వీరిద్దరూ ఊటుకూరు నుంచి నగరవనానికి ద్విచక్రవాహనంలో వెళ్లే క్రమంలో ఎదురుగా వస్తున్న కారు ఢీకొనడంతో శనివారం మృతి చెందిన విషయం తెలిసిందే. ఇది ట్రాఫిక్ పోలీసుల సమాచారం.

ఎస్పీ కార్యాలయం వద్ద...

తమ కుమారుడి మృతిపై ట్రాఫిక్ సీఐ రెండు వైపులా మాట్లాడుతున్నారని, రోడ్డు ప్రమాదం చేసిన వ్యక్తిని అదుపులోకి తీసుకోలేదంటూ మృతుల తల్లిదండ్రులు సుబ్బారెడ్డి, ఉమా, హనుమంతురెడ్డి, కళావతి ఆరోపించారు. ఈ మేరకు ఎస్పీ కార్యాలయం ప్రధాన ద్వారం వద్ద మృతదేహాలతో ఆదివారం వారు ఆందోళన చేశారు. ఘటనా స్థలానికి ఇన్‌ఛార్జి డీఎస్పీ బాలస్వామిరెడ్డి, ఒకటో పట్టణ సీఐ తిమ్మారెడ్డి, ఎస్సైలు ప్రదీప్‌కుమార్, అమర్‌నాథ్‌రెడ్డి వచ్చి బాధితులతో మాట్లాడారు. అక్కడ నుంచి ఆందోళనకారులు డీఎస్పీ కార్యాలయానికి వెళ్లారు. రెండు రోజుల్లో విచారించి న్యాయం చేస్తామని చెప్పడంతో మృతదేహాలను తీసుకెళ్లారు.

రెండు కుటుంబాల్లో విషాదం

మరో ఆరుమాసాల్లో ఇరువురి విద్య పూర్తి అవుతుంది. ఇంతలో ఇద్దరూ మృతి చెందడంతో కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది. పవన్‌కుమార్‌రెడ్డి ఒక్కడే కొడుకు. అతని సోదరి అఖిలారెడ్డి లండన్‌లో చదువుతోంది. రెండు నెలల కిందటే పవన్‌కుమార్‌రెడ్డికి అఖిలారెడ్డి రూ.2.20లక్షలు వెచ్చించి ద్విచక్ర వాహనం కొనిచ్చి ఆమె లండన్‌కు వెళ్లారు. కొద్ది నెలలకు ఇలా జరగడంతో అఖిలారెడ్డి కన్నీరు మున్నీరుగా విలపించారు. జస్వంత్‌కుమార్‌రెడ్డి తండ్రి హనుమంతరెడ్డి హైదరాబాదులో హోమియోపతి ఆసుపత్రి నిర్వహిస్తున్నాడు. చేతికొచ్చిన ఇద్దరు యువకులు మృతి చెందడంతో కుటుంబ సభ్యులు గుండెలవిసేలా రోదించారు.

సిమెంటు లోడు లారీ దగ్ధం.. తప్పిన ప్రమాదం


ప్రమాదంలో కాలిపోయిన లారీ

కంభం, న్యూస్‌టుడే : ద్విచక్ర వాహనాన్ని తప్పించే క్రమంలో సిమెంటు లోడుతో వెళ్తున్న లారీ విభాగినిని ఢీకొనడంతో మంటలు చెలరేగిన సంఘటన కందులాపురం కూడలిలో శనివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. పల్నాడు జిల్లా దాచేపల్లి నుంచి బెంగళూరుకు సిమెంటు లోడుతో లారీ వెళ్తుండగా జూనియర్ కళాశాల వైపు నుంచి వేగంగా వచ్చిన ద్విచక్రవాహనాన్ని తప్పించే క్రమంలో లారీ డివైడర్‌ను ఢీకొంది. దాంతో టైర్లు పేలిపోయి పక్కనే ఉన్న విద్యుత్తు పరివర్తకాన్ని తగలడంతో మంటలు పెద్ద ఎత్తున వ్యాపించాయి. డ్రైవర్ కిందకి దూకేయడంతో ప్రమాదం తప్పింది. రహదారి పక్కనే ఇళ్ల ముందు నిలిపి ఉంచిన రెండు బైకులకు మంటలు వ్యాపించడంతో అవి పూర్తిగా కాలిపోయాయి. ఘటన స్థలానికి ఎస్సై శివకృష్ణారెడ్డి, సిబ్బంది వెంకటేశ్వర్లు చేరుకొని వెంటనే విద్యుత్తు సరఫరా ఆపించారు. అగ్నిమాపక శాఖ మంటలను అదుపు చేసింది. పోలీసులు ఘటన వివరాలు సేకరిస్తున్నారు.

ప్రకాశం జిల్లాలో బ్రాయిలర్ ధరలు (కిలో కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం ధర - 112, రిటైల్ లైవ్ - 139, చికెన్ విత్ స్కిన్ - 215, చికెన్ స్కిన్‌లెస్- 243

తెలుగు బాప్టిస్ట్ చర్చి నూతన కార్యవర్గం ఎన్నిక


ఎన్నికైన కార్యవర్గ సభ్యులు

మార్కాపురం గ్రామీణం, న్యూస్‌టుడే: మార్కాపురం పట్టణంలోని ఏబీఎం కాంపౌండ్‌లో ఉన్న తెలుగు బాప్టిస్ట్ చర్చి నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు కార్యదర్శి ప్రభుదాస్ తెలిపారు. అధ్యక్షుడిగా తాతపూడి శామ్యూల్ జైపాల్, ఉపాధ్యక్షుడిగా కట్టే బెనహ రవికుమార్, కార్యదర్శిగా సంద్రపాటి ప్రభుదాస్, కోశాధికారిగా కోలా రఘుబాబు, సభ్యులుగా అబ్రహం, విజయకుమార్, శ్యామ్‌ను ఎన్నుకున్నట్లు వెల్లడించారు. యూత్ డైరెక్టర్‌గా దారివేముల హర్షిత బాబి, సండే స్కూల్ సూపరింటెండెంట్‌గా సువర్ణ, తదితరులను ఎన్నుకున్నారు. వీరు రెండేళ్ల పాటు కమిటీ సభ్యులుగా కొనసాగుతారని పేర్కొన్నారు.

EENADU e Classifieds

BUSINESS SERVICES

బంగారం కొనబడును: బ్యాంకులలో, ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం విడిపించి అధిక ధరకు కొనబడును (స్పాట్ క్యాష్). ✆ 73311 65666

బంగారం బ్యాంకులలో / ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). ✆ 8142292071.

మధుసూదన్ ఆటోఫైనాన్స్ H.O లో పనిచేయుటకు టెలికాలర్స్-5, అకౌంటెంట్స్-2 కావలెను. ఆకర్షణీయమైన జీతం కలదు. ✆ :8886688938, 9246469894.

గుంటూరు మాస్టర్‌మైండ్స్ కాలేజి నందు వార్డెన్స్, హాస్టల్ ఇన్‌చార్జ్‌గా పనిచేయుటకు పురుషులు కావలెను. జీతం 13000/- నుండి 16000/- వరకు ఇవ్వబడును. (ఉచిత భోజనము వసతి కల్పించబడును) విద్యార్హతలు: ఇంటర్, డిగ్రీ, వయస్సు 20 సంవత్సరములపైన ఉండవలెను. వివరములకు ✆ 9154693478.

EDUCATION

OPEN INTER ADMISSIONS GROUPS: MPC/BIPC/CEC KANDUKUR - 85550 94933, ONGOLE - 87126 95633

JOBS

సురేష్ బుక్‌లింక్స్ ఒంగోలు నందు హోల్‌సేల్ (గూడం) బుక్‌షాపులో పనిచేయుటకు హెల్పర్స్ (యువకులు) కావలెను. (P.T/F.T) ఆకర్షణీయమైన జీతం. ✆ 94907 17572

ప్రముఖ స్టార్ హోటల్ "గీతా రీజెన్సీ" నందు పనిచేయుటకు రుబ్బింగ్, కెప్టెన్స్, వెయిటర్స్, కిచెన్ అసిస్టెంట్స్, రూమ్ సర్వీస్ వెయిటర్స్, ఆర్డర్ టేకర్స్, హౌస్ కీపింగ్ బాయ్స్, కాఫీ స్టాల్, స్టోర్ కీపర్స్, రెస్టారెంట్ ఇంచార్జి మరియు కన్‌స్ట్రక్షన్ సూపర్ వైజర్స్ వెంటనే కావలెను. అనుభవమును బట్టి ఆకర్షణీయమైన జీతం.సంప్ర.4/1, అరండల్‌పేట గుంటూరు. 9949077525.

SBI LIFE ఉద్యోగ అవకాశాలు నందు నియామకాలు జరుగుచున్నవి వయస్సు18 To 70 సం|| అర్హత 10వ తరగతి ఆపైన సంప్ర: 9640252922

SECURITY GUARDS

సెక్యూర్ సెక్యూరిటీ సర్వీసెస్: కొండేపి, టంగుటూరు ఏరియాలలో పనిచేయుటకు సెక్యూరిటీ SO లు, ASO లు, సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. ✆ 99595 98279

అధిక స్పందనలు పొందండి. వాహనాలు అమ్మకం, ఉద్యోగాల భర్తీ, ఇళ్లు, ప్లాట్లు, స్థలాలు అమ్మకాలు, కొనుగోళ్లు, ఇళ్లు, షాపులు, ప్లాట్లు అద్దెకు మరియు అన్ని రకాల బిజినెస్ వ్యవహారాలు.. B/W 5 లైన్ల ప్రకటన రూ.275/- మాత్రమే

వివరాలకు..

97011 12824

ఒంగోలు 80087 09902

మార్కాపురం 80081 11050

మీ చిన్నారులకు పుట్టినరోజు శుభాకాంక్షలు ఈనాడు ద్వారా తెలపండి. B&W : రూ. 500 Colour : రూ. 700

ప్రకటనలపై 5% GST వర్తించును

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తా పత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటన దారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయం లో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

(c) eenadu

కనిగిరి

• కనిగిరి • గిద్దలూరు

అందమైన చేతిరాత ఆత్మ విశ్వాసానికి అద్దం



చేతిరాత శిక్షణలో అనుమానాలు నివృత్తి చేస్తున్న శిక్షకురాలు కవిత

కనిగిరి, న్యూస్‌టుడే: అందమైన చేతి రాత ఆత్మ విశ్వాసానికి అద్దమని చేతిరాత శిక్షకురాలు వి.కవిత తెలిపారు. ఆదివారం పట్టణంలోని గిరిజన సంక్షేమ గురుకుల బాలుర పాఠశాలలోని 8, 9, 10 తరగతుల విద్యార్థులకు చేతిరాతపై ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి అందమైన దస్తూరి ఎంతో అవసరమన్నారు. మంచి చేతిరాతతో మంచి మార్కులు పొందవచ్చన్నారు. అక్షరాల్లో అందం, ఆత్మస్థైర్యంలో విజయం అనే సందేశంతో విద్యార్థులు రోజూ కొంత సమయం చేతిరాత సాధనకు కేటాయించు కోవాలన్నారు. అనంతరం తెలుగు భాషను చక్కగా, స్పష్టంగా ఆకర్షణీయంగా రాయడంలో అవసరమైన మెలకువలను నేర్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ యం. గురుస్వామిరెడ్డి, తెలుగు ఉపాధ్యాయుడు ఆదిశేషులు తదితరులు పాల్గొన్నారు.

తుక్కు.. రాకపోకలకు చిక్కు




బేస్తవారపేట, న్యూస్‌టుడే: పట్టణంలో తుక్కు దుకాణాల నిర్వాహకులు సామగ్రిని మూటల్లో కట్టి అనంతపురం- అమరావతి జాతీయ రహదారికి ఇరువైపులా ఏర్పాటు చేసిన సర్వీస్ రోడ్డుపై కుప్పలుగా వేస్తుండటంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. హైవే అంచునే డంపింగ్ చేస్తుండటంతో వారానికోసారి భారీ వాహనాలు అక్కడే ఆగుతూ నిలిచి తుక్కు మూటలను లారీలతో లోడ్ చేయిస్తున్నారు. రాకపోకలు సాగించేందుకు వాహనదారులు అష్టకష్టాలు పడాల్సి వస్తోంది. జనప వస్తువులను యంత్రాలతో మోదుతుండటంతో తీవ్రమైన శబ్ద కాలుష్యంతో పాటు ప్లాస్టిక్, చిల్లర పొడి గాలిలో విస్తరిస్తుండటంతో శ్వాసకోశ వ్యాధుల బారిన పడుతున్నామని ప్రాంత ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని పట్టణవాసులు కోరుతున్నారు.

కాటమరాజు ఆలయానికి రోడ్డు వేయించండి

పెద్దదోర్నాల: వెలిగొండ జలాశయంలో కృష్ణా జలాలు నింపుతుండటంతో కాటమరాజు ఆలయానికి రహదారి మూసుకు పోతుందని నూతన రహదారి వేయాలని రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార శాఖ మంత్రి పార్థసారథికి శ్రీ కాటమరాజు గంగాభవాని దేవస్థానం కమిటీ సభ్యులు వినతి పత్రం ఇచ్చారు. వెలిగొండ సీఎం పర్యటన ఏర్పాట్లు పరిశీలించేందుకు వచ్చిన ఆయనకు వారు రహదారి సమస్యను వివరించారు. అందుకు స్పందించిన ఆయన రహదారి వేయించేందుకు కృషి చేస్తానని వారికి హామీ ఇచ్చారు. కమిటీ సభ్యులు రాజు యాదవ్, సుబ్బారావు యాదవ్, యల్లేష్, సత్యనారాయణ, పిచ్చయ్య పాల్గొన్నారు.

మార్గంలో చెత్త.. మార్పురాదా ఇక?



కనిగిరి పట్టణంలోని బీసీ బాలుర, ఎస్సీ బాలుర, ఆనంద నిలయం వసతి గృహాలకు వెళ్లే మట్టి రోడ్డు చెత్తా చెదారంతో నిండి ఉండటంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. చిన్న పాటి వర్షం కురిసిన రోడ్డు మొత్తం బురదమయమై రాకపోకలకు నానా అవస్థలు పడాల్సి వస్తోందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెత్తను రోడ్డు మీద వేయకుండా చేసి మట్టి మార్గాన్ని సీసీ రోడ్డుగా మార్చి ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులను కోరుతున్నారు. – న్యూస్‌టుడే, కనిగిరి

వెలిగొండ.. అడుగడుగునా అండా దండా

☛ మహోన్నత కార్యక్రమానికి తరలిరండి: మంత్రి ఆనం



కంభం: బోనాలతో ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి, మహిళలు

కంభం, న్యూస్‌టుడే : వెలిగొండ జలాలతో మార్కాపురం జిల్లా రూపురేఖలు మారనున్నాయని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. వెలిగొండ ప్రాజెక్టు ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం పట్టణంలోని రామాలయం నుంచి చెరువుకట్టకు వెళ్లే దారిలో అంకాలమ్మ ఆలయం వరకు మహిళలతో కలిసి ఆయన అమ్మవారికి బోనాలు సమర్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ ప్రాజెక్టు ద్వారా కరవు ప్రాంతానికి తాగు, సాగునీరు అందుతుందని తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందన్నారు. రామాలయం, శివాలయం, అమ్మవారి ఆలయాల్లో పూజలు చేశారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

● కనిగిరి: వెలిగొండ ప్రాజెక్ట్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి మార్కాపురం జిల్లా నలుమూలల నుంచి అధిక సంఖ్యలో ప్రజలు స్వచ్ఛందంగా తరలిరావాలని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. ఆదివారం స్థానిక అమరావతి మైదానంలో వెలిగొండ ప్రాజెక్ట్ ప్రారంభోత్సవ కార్యక్రమంపై సమావేశం నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తూ ప్రాజెక్ట్ చంద్రబాబు చేతుల్లోనే పురుడు పోసుకుని తిరిగి ఆయన చేతుల మీదుగా ఈ ప్రాంత ప్రజలకు అంకితం చేస్తున్నారన్నారు. ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి మాట్లాడుతూ మార్కాపురం జిల్లా ప్రజలు శ్వాస అయిన వెలిగొండను పూర్తి చేసి జిల్లాలోని నాలుగు నియోజకవర్గాలను నీరు అందనుందని చెప్పారు. కార్యక్రమంలో మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, డీసీఎంఎస్ ఛైర్మన్ శ్యామల కాశిరెడ్డి, నియోజకవర్గ పరిశీలకురాలు సుధ, కనిగిరి, పామూరు, వెలిగండ్ల, హనుమంతునిపాడు, పి.సి.పల్లి, సీయస్‌పురం, మండల అధ్యక్షులు కొండా కృష్ణారెడ్డి, బొల్లా నరసింహరావు, కేలం ఇంద్రభూపాల్‌రెడ్డి, సానికొమ్ము తిరుపతిరెడ్డి, ఏనుగంటి శ్రీనివాసులు, బొబ్బూరి రమేష్, కనిగిరి, పామూరు పట్టణ అధ్యక్షులు ఫిరోజ్, అమీర్‌బాబు పాల్గొన్నారు.



కనిగిరి: మాట్లాడుతున్న మంత్రి రామనారాయణరెడ్డి, పక్కన మాజీ మంత్రి ఉమామహేశ్వరరావు, ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి

● సి.ఎస్.పురం: ప్రాజెక్టు వద్ద ఏర్పాటు చేసిన సభను విజయవంతం చేయాలని తెదేపా మండల అధ్యక్షుడు బొబ్బూరి రమేష్ అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ప్రాజెక్టు ప్రారంభోత్సవ కార్యక్రమానికి జనసమీకణ, వాహనాల ఏర్పాటు వంటి వాటి గురించి ఆయన తెదేపా నాయకుల సమావేశం నిర్వహించారు. నాయకులు బి.వెంకటేశ్వర్లు, ఎన్‌సీ మాలకొండయ్య తదితరులు పాల్గొన్నారు.

● హనుమంతునిపాడు: తెదేపా మండల అధ్యక్షుడు తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటికీ తిరిగి పార్టీ శ్రేణులు, కార్యకర్తలు కరపత్రాలతో ప్రాజెక్టు ప్రారంభోత్సవంపై ప్రచారం నిర్వహించారు.

ఎండలకు 'కంది'పోవాల్సిందేనా!



ముద్దపాడులో స్ప్రింక్లర్ల ద్వారా కంది పంటకు నీరు

పీసీపల్లి, న్యూస్‌టుడే: ఖరీఫ్ సీజన్ ప్రారంభమై రెండు నెలలు గడుస్తున్నా.. పూర్తిస్థాయిలో వర్షాలు కురవలేదు. దీంతో అదును దాటిపోతుందని భయంతో పీసీపల్లి మండలంలోని పలు గ్రామాల రైతులు ఇటీవల కురిసిన కొద్దిపాటి వర్షానికి కంది పంటను విత్తారు. భూమిలో తేమ శాతం లేకపోవడంతో కొద్దిశాతం మాత్రమే మొలకెత్తాయి. కొన్నిచోట్ల మొలిచిన మొక్కలు ఎండిపోతున్నాయి. దీంతో అందుబాటులో ఉన్న బోరుబావుల్లోని నీటిని తోడి స్ప్రింక్లర్ల ద్వారా నీటి తడులు ఇస్తున్నారు. పెట్టిన పెట్టుబడులు అయినా రావాలని రైతులు తీవ్ర ప్రయత్నం చేస్తున్నారు.

కాలువనా.. మురుగు కుంటనా

హెచ్‌ఎంపాడులో కస్తూర్బా పాఠశాల, ఎలిమెంటరీ బడి సమీపంలో ఉన్న మురుగు కాలువ దుర్వాసన వెదజల్లుతోంది. కస్తూర్బా పాఠశాల నుంచి వచ్చే నీరుతో పాటు వర్షం వస్తే చుట్టుపక్కల నీరు ఇక్కడ చేరుతుంది. తటాకం మాదిరిగా మారి మురుగు కుంటలా ఏర్పడటంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. కొండారెడ్డిపల్లికి వెళ్లే ప్రయాణికులు ఇక్కడి నుంచే ఆటోల్లో వెళ్లాల్సి వస్తుండటంతో దుర్వాసన తట్టుకోలేక పోతున్నామని ఆరోపిస్తున్నారు. వృథా నీటికి ఇంకుడు గుంత ఏర్పాటు చేయాలని, కాలువ శుభ్రం చేయించాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. – న్యూస్‌టుడే, హనుమంతునిపాడు



దుర్వాసన బాబోయ్...



గిద్దలూరు మండలం పొదలకుంటపల్లె గ్రామంలోని సహకార బ్యాంకు భవనం ఎదురుగా ఉన్న ఎస్సీ కాలనీలోకి వెళ్లే రహదారిలో నిత్యం మురుగు నిల్వ ఉంటోంది. సీసీ రోడ్డుపై మురుగు నీరు నిల్వ ఉండటంతో ప్రజలు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. గృహాల్లోని వ్యర్థ నీరు బయటకు వెళ్లేందుకు పక్కకాలువలు లేకపోవడంతో మురుగు రహదారిపై నిల్వ ఉంటోంది. స్థానికులు పలుసార్లు అధికారులకు విన్నవించుకున్నప్పటికీ ఫలితం లేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు చొరవ తీసుకొని సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు. – న్యూస్‌టుడే, గిద్దలూరు పట్టణం

పేరుకే ఉంది.. నీరు మాత్రం లేదు

గిద్దలూరు మండలం పొదలకుంటపల్లె గ్రామంలోని సచివాలయానికి వెళ్లు రహదారిలో పశువుల కోసం నీటి తొట్టిని ఏర్పాటు చేశారు. తొట్టి నిర్మాణం చేపట్టినప్పటికీ నీటి సౌకర్యం ఏర్పాటు చేయక నిరుపయోగంగా మారింది. ప్రస్తుతం ఎల్‌నినో ప్రభావంతో గ్రామంలోని కుంటల్లో నీటి నిల్వలు లేవు. ఇలాంటి పరిస్థితుల్లో దీనిని ఉపయోగంలోకి తీసుకవచ్చేలా చర్యలు చేపట్టాలని పశుపోషకులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, గిద్దలూరు పట్టణం



మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM)

కనిగిరి : 8008574114
గిద్దలూరు పట్టణం : 8008574135

హనుమంతునిపాడు:?: మండలంలోని నీలకంఠాపురం గ్రామానికి పైప్‌లైన్ ఏర్పాటు లేకపోవడంతో సాగర్ నీరు రావడం లేదు. పక్కగ్రామానికి వెళ్లి తెచ్చుకుంటున్నాం. చర్యలు తీసుకోగలరు. – బి. చెన్నయ్య, గ్రామస్థులు

✓: నీలకంఠాపురం, మల్లవరం గ్రామాలకు పైప్‌లైన్ ఏర్పాటు ఆగిపోయింది. నిధులు మంజూరైతే పనులు ప్రారంభిస్తాం. – శ్రీకాంత్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ

మిట్టపాలెంలో ప్రత్యేక పూజలు



సి.ఎస్.పురం, న్యూస్‌టుడే: జిల్లాలో ప్రసిద్ధిగాంచిన మిట్టపాలెం నారాయణస్వామి దేవస్థానంలో ఆదివారం భక్తులు పూజలు నిర్వహించారు. మహిళలు ఉపవాస దీక్షలతో స్వామి వారికి పొంగళ్లు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. మూలవిరాట్టును వివిధ రకాల పూలమాలలతో అలంకరించారు. ఆలయ ప్రధాన అర్చకులు ఎం.శివప్రసాద్‌శర్మ స్వామికి అభిషేకాలు, గోపూజలు జరిపారు. అనంతరం పల్లకీ సేవ, రథోత్సవం జరిగింది. దేవస్థానం ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఆలయ ఈవో ఎస్.నరసింహబాబు, వ్యవస్థాపక ధర్మకర్త కె.చిన్నఆదినారాయణ, సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు.

విద్యార్థుల్లో మాట్లాడే నైపుణ్యానికి 'వక్త పోటీలు'



పోస్టర్‌ను విడుదల చేస్తున్న జన విజ్ఞాన వేదిక నాయకులు

పామూరు, న్యూస్‌టుడే : విద్యార్థుల్లో మాట్లాడే నైపుణ్యాన్ని పెంపొందించేందుకు జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా పాఠశాలలు, కళాశాలల్లో వక్త కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆ నాయకులు తెలిపారు. ఇందులో భాగంగా పామూరులో వక్త పోస్టర్‌ను విడుదల చేశారు. వారు మాట్లాడుతూ పాఠశాల, కళాశాల, మండల, జిల్లా స్థాయిల్లో పోటీలు వచ్చే నెల 1వ తేదీ నుంచి అక్టోబర్ 30 వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలను నవంబరు 14న ఒంగోలులోని పేస్ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ ప్రతిభను చాటుకోవాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు విశ్వనాథ, కొల్లా నాగేశ్వరరావు, కృష్ణాజి, శేషాద్రిరెడ్డి, రమేష్‌రాజు, మధు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు అనేకం.. పరిష్కారం శూన్యం

కాలనీ కష్టాలు

గిద్దలూరు పట్టణం, న్యూస్‌టుడే :

వార్డు	3వ
గృహాలు	2,100
జనాభా	4,300



రామచంద్ర డెంటల్ క్లినిక్ వద్ద కుళాయి ఇలా..

గిద్దలూరు పురపాలికలోని 3వ వార్డులో వేసవి కాలం వచ్చిందంటే నీటి కష్టాలు తప్పడం లేదు. ఒకవేళ వర్షం వచ్చిందంటే పక్కకాలువలు సరిగా లేక మురుగు నీరు ఎటుపోక రహదారిపైకి చేరి ప్రజలు నడిచేందుకు నానా అవస్థలు పడుతున్నారు. దీని పరిధిలో ప్రశాంతినగర్, గర్రె వారి వీధి, పోతుగంటి వీధి, క్లబ్ రహదారి, పెద్ద పోస్టాఫీసు వెనుక వైపు ప్రాంతాలు ఉన్నాయి. ఈ ప్రాంతాల్లో డీప్‌బోర్లు ఉన్నప్పటికీ ప్రస్తుతం భూగర్భ జలం అడుగంటడంతో ప్రజలు ట్యాంకర్ల ద్వారా సరఫరా చేసే నీటిని పట్టుకుని వినియోగించుకోవాల్సి వస్తోంది. మళ్లీ ట్యాంకర్లు వచ్చేంత వరకు ప్రజలు వాడుక నీటి కోసం వేచిచూడాల్సి వస్తోంది. పక్కకాలువ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో మురుగు ముందుకు వెళ్లే అవకాశం లేకపోవడంతో దోమల బెడద అధికంగా ఉంటోంది. గృహ యజమానులు ముందుకు వచ్చి నిర్మాణాలు చేపడుతుండటంతో రోడ్లు ఇరుకుగా మారుతున్నప్పటికీ పురపాలక, పట్టణ ప్రణాళికా విభాగం అధికారులు అడ్డుకోకుండా మిన్నకుండిపోతున్నారని స్థానికులు ఆరోపణలు వినిపిస్తున్నాయి.



బీమా చెక్కును అందజేస్తున్న ఏపీజీబీ మేనేజర్, తదితరులు

ప్రమాద బీమాతో కుటుంబానికి అండ

బేస్తవారపేట, న్యూస్‌టుడే: మండలంలోని అక్కపల్లికి చెందిన కొమ్ము పెద్ద రంగమ్మ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా ఆమె బ్యాంక్ ఖాతాను పరిశీలించిన అధికారులు ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన కింద బీమా నమోదై ఉన్నట్లు గుర్తించారు. ప్రక్రియ పూర్తి చేసి ఆమె కుటుంబానికి ఈ పథకం కింద రూ.2 లక్షల బీమాను అందజేశారు. ఆదివారం గలిజేరుగుళ్లలోని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్‌లో మేనేజర్ ప్రదీప్ కుమార్‌రెడ్డి సమక్షంలో కంభం ఆర్థిక అక్షరాస్యత కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో బీమా చెక్కును నామీనిగా ఉన్న ఆమె భర్త సైదయ్యకు అందజేశారు. కార్యక్రమంలో కంభం ఆర్థిక అక్షరాస్యత కేంద్రం ప్రాజెక్ట్ డైరెక్టర్ వి.ఆంజనేయులు, ప్రాజెక్ట్ మేనేజర్ అశోక్ కుమార్, కౌన్సిలర్లు పి.అశోక్‌కుమార్, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

కోటా సత్యమాంబదేవికి కుంకుమార్చనలు



పూజలందుకున్న అమ్మవారు

కంభం, న్యూస్‌టుడే : పట్టణ సమీపంలోని కోటా సత్యమాంబదేవికి ఆదివారం భక్తులు విశేష పూజలు నిర్వహించారు. అమ్మవారిని పసుపు, కుంకుమలు, పుష్పాలు, నిమ్మకాయలతో ప్రత్యేకంగా అలంకరించారు. అభిషేకాలు, కుంకుమార్చనలు తదితర పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలోని శ్రీచక్రం, శివుడు, వినాయకుడు, సుబ్రహ్మణ్య స్వామి, పుట్టాలమ్మ వద్ద భక్తులు పూజలు చేశారు. కుంకుమబండ్లు కట్టి మొక్కులు తీర్చుకున్నారు. అమ్మకు బోనాలు, చీరలు, గాజులు సమర్పించారు. పలు ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసింది. కోటా సత్యమాంబదేవి నామస్మరణతో ఆ ప్రాంతం మారుమోగింది. భక్తులకు ఆలయ నిర్వాహకులు తీర్థప్రసాదాలు అందజేశారు.

50 శాతం రాయితీపై పశువుల దాణా

అర్థవీడు, న్యూస్‌టుడే: వెలిగొండ ప్రాజెక్టు ముంపు గ్రామాల పశుపోషకులకు 50 శాతం రాయితీపై పశువులు దాణా అందజేసినట్లు అర్థవీడు పశువైద్యులు శివారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. లక్ష్మీపురం, కృష్ణానగర్ ముంపు గ్రామాలకు చెందిన 22 మంది పశుపోషకులు మాగుటూరులో నివాసం ఉంటున్నారు. ఈ నేపథ్యంలో వారందరికి ప్రభుత్వ ఆదేశాల మేరకు ఒక్కొక్కరికి 50 కేజీల దాణాను అందజేశారు. త్వరలో వంద శాతం రాయితీపై ముంపు గ్రామాల పశుపోషకులకు దాణా అందజేయనున్నట్లు ఆయన తెలిపారు.



పశుపోషకులకు దాణా బస్తాలను అందజేస్తున్న పశువైద్యులు, సిబ్బంది

పాస్‌పోర్టు పోయినది


కందుల వెంకటరమణారెడ్డి S/o కందుల పెద్దకాటపురెడ్డి గారి పాస్‌పోర్టు నం. T3253730, 28-08-2026 ఉదయం 7.30 గంటల నుండి 8 గంటల మధ్య మొహిద్దీన్‌పురం నుండి అర్థవీడు వరకు బైక్‌పై ప్రయాణిస్తున్న సమయంలో పోయినది. ఈ పాస్‌పోర్టు ఎకవరికైనా లభించినట్లయితే ఫోన్: 92656 45962కు సమాచారం ఇవ్వగలరు.

ఆరోగ్యంపై శాస్త్రీయ అవగాహన పెంచుకోవాలి

కనిగిరి, న్యూస్‌టుడే: ఆరోగ్యంపై శాస్త్రీయ అవగాహన పెంచుకోవాలని డా. కొల్లా నాగేశ్వరరావు తెలిపారు. ఆదివారం పట్టణంలోని ఓ స్కూల్లో జేవీవీ ఆధ్వర్యంలో ఉచిత ఆరోగ్య అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానసిక ఒత్తిడిని నియంత్రించుకోవడం తగినంత నిద్ర, సమతుల్య ఆహారం, క్రమబద్ధమైన జీవనశైలి, శారీరక వ్యాయామం, ఆరోగ్యకరమైన జీవితానికి ఎంతో అవసరమన్నారు. ఆరోగ్యానికి సంబంధించిన అపోహలను నమ్మకుండా శాస్త్రీయ దృక్పథంతో వ్యవహరించాలని సూచించారు. కార్యక్రమంలో సంఘ నాయకులు షేక్ గయాజ్ బాషా, డా.ప్రత్యూష సుబ్బారావు, విశ్వనాథ, మధు, కొండమ్మ, మీనా, చిన్నాజీ పాపారాయుడు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ నాగేశ్వరరావు





మార్కాపురం

• మార్కాపురం • యర్రగొండపాలెం



పోలేరమ్మా.. దండాలమ్మా..

మార్కాపురం గ్రామీణం, న్యూస్‌టుడే: పట్టణ శివారులోని మార్కాపురం గ్రామదేవత శ్రీఅల్లూరి పోలేరమ్మ దేవస్థానంలో ఆదివారం ఆలయ పూజారి ఆర్.ఎస్. శర్మ ఆధ్వర్యంలో విశేష అలంకరణలో భక్తులకు అమ్మ దర్శనభాగ్యం కల్పించారు. అధిక సంఖ్యలో భక్తులు పోలేరమ్మను దర్శించుకుని పొంగళ్ల నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈవో చెన్నకేశవరెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

ఇరువర్గాల మధ్య ఘర్షణ

కొనకనమిట్ల, న్యూస్‌టుడే: కొనకనమిట్ల మండలంలోని వాగుమడుగు పంచాయతీలోని అంబాపురం గ్రామంలో ఆదివారం తెదేపా, వైకాపా కార్యకర్తల మధ్య స్థలం విషయంలో వాగ్వాదం చోటుచేసుకుని ఘర్షణకు దారితీసింది. ఇరువర్గాలు వారు పరస్పరం తోపులాటకు దిగడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ సంఘటనలో పలువురికి స్వల్ప గాయాలయ్యాయి. ప్రథమ చికిత్స నిమిత్తం పొదిలి వైద్యశాలకు తరలించారు. ఇరువర్గాల వారు పోలీసులు స్టేషన్‌లో ఫిర్యాదు చేసుకున్నారు.

పేదలకు నిత్యావసరాల పంపిణీ

పొదిలి: మానవతా సంస్థ పొదిలి శాఖ ఆధ్వర్యంలో ఆదివారం పేదలకు నిత్యావసరాలు, ఆర్థికసాయం అందజేశారు. ఇటీవల అనారోగ్యంతో చనిపోయిన ముగ్గురు కుటుంబ సభ్యులకు ఒక్కొక్కరికి రూ.5 వేల విలువైన సరకులు అందజేశారు. అనారోగ్యంతో చనిపోయిన గురజాల చిన్న నరసయ్య కుటుంబ సభ్యులకు రూ.10 వేలు, చీకటి వెంకటయ్య కుటుంబ సభ్యులకు రూ. ఐదువేలు ఆర్థికసాయం అందించారు. దాతలు ఆవుల క్రిష్టారెడ్డి, మానవతా సంస్థ ప్రతినిధులు పార్థసారథి, సుబ్బారెడ్డి, వెలిశెట్టి వెంకటేశ్వర్లు, చిరంజీవి, వెంకట కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

పోలీసులు అప్రమత్తంగా ఉండాలి


సిబ్బందికి సూచనలిస్తున్న ఎస్పీ హర్షవర్ధన్ రాజు

పెద్దదోర్నాల, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి వెలిగొండ పర్యటనలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు పోలీసులకు సూచించారు. దోర్నాల మండలం గంటవానిపల్లె సమీపంలో సోమవారం సీఎం పర్యటన జరుగనున్న సందర్భంగా ఆదివారం పోలీసుల కాన్వాయ్ ట్రయల్ రన్ నిర్వహించారు. అనంతరం ఆయన బందోబస్తు విధులపై వారికి సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 1800 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. డ్రోన్, సీసీ కెమెరాల ద్వారా నిరంతరం నిఘా కొనసాగించేలా కంట్రోల్ గది ఏర్పాటు చేశామన్నారు.

పొదిలి నుంచి భారీగా తరలివెళ్లనున్న ప్రజలు

పొదిలి: వెలుగొండ ప్రాజెక్టు ప్రారంభోత్సవానికి వస్తున్న ముఖ్యమంత్రి బహిరంగసభకు పొదిలి మండలం నుంచి ప్రజలు భారీగా హాజరయ్యేలా నాయకులు సమాయత్తం చేస్తున్నారు. పొదిలి పట్టణం, మండలం నుంచి 50 బస్సుల్లో ప్రజలు, మరో 50 బస్సుల్లో స్వయం సహాయక సంఘాల మహిళలు బహిరంగసభకు హాజరయ్యేలా చర్యలు తీసుకుంటున్నారు. సోమవారం ఉదయం 8 గంటలకే పొదిలిలో బయలుదేరి బహిరంగసభ వద్దకు చేరేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

WANTED

యర్రగొండపాలెం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (PACS) ద్వారా నిర్వహించబడుతున్న IOCL (ఇండియన్ ఆయిల్) పెట్రోల్‌బంక్ నందు పనిచేయుటకు ఆసక్తి గల స్త్రీ/పురుష అభ్యర్థులు కావలెను.

పోస్టు ఫ్యూయల్ సేల్స్ బాయ్స్/గర్ల్స్

అర్హత 10వ తరగతి పాస్/ ఫెయిల్ (చదవడం, రాయడం తెలిసి ఉండాలి)

వయస్సు 18 నుండి 35 సంవత్సరాల మధ్య

జీతం అర్హత మరియు అనుభవాన్ని బట్టి తగిన వేతనం ఇవ్వబడును.

గమనిక స్థానిక (యర్రగొండపాలెం మరియు పరిసర ప్రాంతాల) అభ్యర్థులకు ప్రాధాన్యత ఇవ్వబడును. ఆసక్తిగలవారు సంప్రదించగలరు.

చిరునామా

ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (PACS)
కొలుకుల రోడ్డు, నియర్ క్రాంతి ట్రాన్స్‌పోర్టు, యర్రగొండపాలెం గ్రామం, యర్రగొండపాలెం (మం), మార్కాపురం జిల్లా.
చైర్‌పర్సన్/ CEO సెల్: 94413 66161, 94405 59803.

కాటమరాజు ఆలయానికి రోడ్డు వేయించండి


మంత్రి పార్థసారథికి వినతి పత్రం ఇస్తున్న కాటమరాజు గంగాభవానీ దేవస్థానం కమిటీ సభ్యులు

పెద్దదోర్నాల: వెలిగొండ జలాశయంలో కృష్ణా జలాలు నింపుతుండటంతో కాటమరాజు ఆలయానికి రహదారి మూసుకు పోతుందని నూతన రహదారి వేయాలని రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార శాఖ మంత్రి పార్థసారథికి శ్రీ కాటమరాజు గంగాభవాని దేవస్థానం కమిటీ సభ్యులు వినతి పత్రం ఇచ్చారు. వెలిగొండ సీఎం పర్యటన ఏర్పాట్లు పరిశీలించేందుకు వచ్చిన ఆయనకు వారు రహదారి సమస్యను వివరించారు. అందుకు స్పందించిన ఆయన రహదారి వేయించేందుకు కృషి చేస్తానని వారికి హామీ ఇచ్చారు. కమిటీ సభ్యులు రాజు యాదవ్, సుబ్బారావు యాదవ్, యల్లేష్, సత్యనారాయణ, పిచ్చయ్య పాల్గొన్నారు.

మహాజనసభ సమావేశపు ప్రకటన

ది మార్కాపురం పబ్లిక్ సర్వెంట్స్ సహకార గృహ నిర్మాణ సంఘం లిమిటెడ్, మార్కాపురం

ఇందుమూలముగా ది మార్కాపురం పబ్లిక్ సర్వెంట్స్ సహకార గృహ నిర్మాణ సంఘం లిమిటెడ్, మార్కాపురం OA.No.185 సంఘ సభ్యులకు తెలియజేయునది ఏమనగా, మన సంఘమునకు చెందిన ఈ క్రింద పేర్కొన్న అజెండాలోని వివిధ అంశములు మీద చర్చించుటకు తేది.16.09.2026 బుధవారం ఉదయం 11.00 గంటలకు నెహ్రూబజారునందు గల ది మార్కాపురం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం, మార్కాపురం సంఘ ఆవరణలో జరగబోవు మహాజన సభ సమావేశమునకు సంఘ సభ్యులందరూ తప్పక హాజరు కావలసినదిగా కోరడమైనది.

ఎజెండా:

1. సంఘముపైన U/S 51 విచారణ అధికారి శ్రీ G.వీరప్రసాద్ అసిస్టెంట్ రిజిస్ట్రార్ గారు సమర్పించిన విచారణ నివేదిక పైన శ్రీయుత జిల్లా సహకార అధికారిగారు జారీ చేసిన ఫైండింగ్స్‌ని మరియు విచారణ నివేదికను మహాజన సభ సమావేశమునందు వుంచి చర్చించుట గురించి
2. సంఘ స్పెషల్ ఆఫీసర్‌గారి అనుమతితో ఇతర అంశముల గురించి చర్చించుట గురించి

ఇట్లు సం/- M.రమాదేవి, జూనియర్ ఇన్‌స్పెక్టర్
స్పెషల్ ఆఫీసర్, మార్కాపురం పబ్లిక్ సర్వెంట్స్ సహకార గృహ నిర్మాణ సంఘం లిమిటెడ్, OA.No.185 మార్కాపురం

భాషాభివృద్ధికి 'నాయని' సేవలు చిరస్మరణీయం


శ్రీనివాసరావును సన్మానిస్తున్న అధికార భాషా సంఘం ప్రతినిధులు

పొదిలి, న్యూస్‌టుడే: ఒంగోలులో ఆదివారం జరిగిన ప్రకాశం జిల్లా తెలుగు వెలుగు విశిష్ట సాహిత్య సదస్సులో పొదిలి బిట్స్ విద్యా సంస్థల కరస్పాండెంట్ బి.శ్రీనివాసరావు తెలుగు భాషా, రచన, సాహిత్యంపై ప్రసంగించారు. నవ్య భావ కవితా యుగశేఖరుడు, స్వాతంత్ర సమర యోధులు నాయని సుబ్బారావు సాహిత్యం, రచనలపై చర్చించారు. ఈ సందర్భంగా అధికార భాషా సంఘం అధ్యక్షులు పి.త్రివిక్రమరావు, ఆంధ్ర సారస్వత పరిషత్ అధ్యక్షులు గజల్ శ్రీనివాసరావు బెల్లంకొండ శ్రీనివాసరావును ఘనంగా సన్మానించారు. జ్ఞాపికలు అందజేశారు. భాష మనుగడ సాగించాలంటే సాహితీవేత్తలు అవసరమని పలువురు కొనియాడారు.

నీట్ పీజీ పరీక్షకు 426 మంది హాజరు

ఒంగోలు కలెక్టరేట్: ఒంగోలులోని మూడు కేంద్రాల్లో ఆదివారం నిర్వహించిన నీట్ పీజీ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ఒంగోలు సమీపంలోని రైజ్ కృష్ణసాయి కళాశాల, మామిడిపాలెం జంక్షన్‌లోని నేషనల్ కౌన్సిల్ ఫర్ ది చర్చ్ సోషల్ యాక్షన్ ఇండియా, బ్రిలియంట్ కంప్యూటర్ ఎడ్యుకేషన్ సంస్థలోని కేంద్రాల్లో ఉదయం 9 నుంచి 12.30 గంటల వరకు ఆన్‌లైన్ విధానంలో పరీక్షను నిర్వహించారు. మొత్తం 434 మంది అభ్యర్థులకు గానూ, 426 మంది హాజరయ్యారు.







(c) eenadu

ప్రత్యేక రంగు చీరలతో మహిళల జలహారతి


మహిళలకు అందించే చీరలు

యర్రగొండపాలెం, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సోమవారం వెలిగొండ ప్రాజెక్టును ప్రారంభించడానికి జిల్లాకు రానున్నారు. ఫీడర్ కెనాల్ వద్ద నీటిని వదిలి జలహారతి ఇస్తారు. ఈ కార్యక్రమానికి దాదాపు రెండు వేల మంది మహిళలను ప్రత్యేకంగా ఆహ్వానించారు. నియోజకవర్గ తెదేపా ఇన్‌ఛార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు అతివలందరికీ పసుపు, ఎరుపు రంగు చీరలు పంపిణీ చేశారు. సీఎం నిర్వహించే కృష్ణమ్మకు జలహారతిలో వీరందరూ పాల్గొని ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నారు. ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి చిరకాలం గుర్తుండిపోయేలా అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు.

బోడపాడు పాఠశాలలో 'వెలిగొండ' సందడి

మార్కాపురం గ్రామీణం, న్యూస్‌టుడే: ఉమ్మడి జిల్లా ప్రజల మూడు దశాబ్దాల తాగు, సాగునీటి కల సాకారం కానున్న వేళ, సోమవారం జరిగే పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని బోడపాడు ప్రాథమిక పాఠశాలలో ఆదివారం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. వెలిగొండ ప్రాజెక్టు ప్రాధాన్యం, నల్లమలసాగర్‌కు కృష్ణా జలాల చేరిక, తద్వారా ఈ ప్రాంతానికి కలిగే ప్రయోజనాలపై ఉపాధ్యాయుడు ఆర్మీ శ్రీను విద్యార్థులకు అవగాహన కల్పించారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన వెలిగొండ ప్రాజెక్టు నమూనా చిత్రపటాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. చదువుతో పాటు ఈ ప్రాంత అభివృద్ధి, సాగునీటి ప్రాజెక్టుల ప్రాధాన్యంపై విద్యార్థుల్లో అవగాహన పెంపొందించడమే కార్యక్రమం ఉద్దేశమని ప్రధానోపాధ్యాయుడు ఎం.జాకబ్ తెలిపారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రైతుల మదిలో ఆశల పరవళ్లు

● కృష్ణా జలాల విడుదల నేపథ్యంలో హర్షం

నల్లమల సాగర్‌కు కృష్ణా జలాలను ముఖ్యమంత్రి చంద్రబాబు సోమవారం విడుదల చేయనుండటంతో ఈ ప్రాంత రూపురేఖలు మారుతాయని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ప్రాజెక్టు మొదటి దశలో 1.19 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుంది. తీగలేరు కాలువ ద్వారా 62 వేల ఎకరాలు, గొట్టిపడియ కాలువ కింద 9,500 ఎకరాలకు సాగునీరు అందనుండగా.. 4 లక్షల మందికి తాగునీరు తక్షణమే అందనుంది. ఎడారిగా మారిన బీళ్లు పచ్చని పంట పొలాలుగా అలరారనున్నాయి.

–న్యూస్‌టుడే, అర్ధవీడు, కంభం

కళ్లారా చూస్తానని అనుకోలేదు



నాకు 5 ఎకరాల భూమి ఉంది. మరో 3 ఎకరాలు కౌలుకు చేస్తున్నాం. రెండు డీప్ బోర్లు వేసుకుని ఏడాదికి ఒకపైరు సాగు చేస్తున్నాం. అయితే నా చిన్నతనంలో వెలిగొండ ప్రాజెక్టుకు చంద్రబాబు శంకుస్థాపన చేశారు. మా పొలాలు సస్యశ్యామలం అవుతాయని మా పెద్దలు అప్పుడే సంతోషపడ్డారు. నీ హయాంలో వెలిగొండ జలాలు వస్తాయని.. ఏడాదికి మూడు పైర్లు పండించుకుని బతకమనేవారు. కానీ గత పాలనలో నీళ్లు లేకుండా ప్రాజెక్టును ప్రారంభించడంతో ఇక నీళ్లు రావని అనుకున్నా.. కానీ ఇప్పుడు కళ్లారా చూస్తున్నాం. సొరంగాల ద్వారా ఆదివారం ఫీడర్ కాలువకు వదలడం చూశాం. రాబోయే రోజుల్లో ఈ నీరు మా పొలాలకు చేరుతుందని సంతోషంగా ఉంది.

–టి.శ్రీనివాసులు, రైతు, నేకునాంబాద్, బేస్తవారపేట మండలం

కాకర్ల మరో కోనసీమ కానుంది



వెలిగొండ ప్రాజెక్టు కాకర్ల ఆనకట్ట దిగువన 6 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. సకాలంలో డీప్ బోరుతో నీరందక భూగర్భజలాలు అడుగంటి పంటను కాపాడుకునేందుకు నానా కష్టాలు పడేవాళ్లం. దానికి తోడు ఫ్లోరైడ్ శాతం కూడా ఎక్కువగా ఉండటంతో పెద్దగా దిగుబడులు వచ్చేవి కాదు. అయితే ఆనకట్టకు వెలిగొండ జలాలు చేరితే మా బోర్లకు నీరు పుష్కలంగా వస్తుంది. మంచి దిగుబడులు సాధించవచ్చు. 30 ఏళ్లుగా ప్రాజెక్టు పనులు ఎప్పుడు పూర్తవుతాయా అని ఎదురు చూస్తున్నాం. చివరకు పనులు పూర్తి చేసుకుని నేడు చంద్రబాబు ప్రారంభోత్సవానికి రానుండటం చాలా ఆనందంగా ఉంది. కాకర్ల మరో కోనసీమ కానుంది. –ఎం.కోటిరెడ్డి, రైతు, కాకర్ల, అర్ధవీడు మండలం

కల నెరవేరుతోంది



'నా జీవిత కాలంలో వెలిగొండ ప్రాజెక్టుకు నీరు వస్తుందనుకోలేదు. ఎన్నో ఏళ్ల ఎదురుచూపులు ఫలిస్తున్నాయి. సీఎం చంద్రబాబు కృషితోనే ఇది సాకారమవుతోంది. మా గ్రామం వద్ద రిజర్వాయర్ నిర్మించారు. దాంట్లోకి నీరు వస్తే మా ఊరితో పాటు చుట్టపక్కల గ్రామాల్లోనూ భూగర్భ జలాలు పెరుగుతాయి. దాని నుంచి మా గ్రామ చెరువుకు నీరు వస్తుంది. మాగాణి పొలంతో పాటుగా, రేగడి భూమికి సాగు జలాలు వచ్చే అవకాశం ఉంటుంది. కృష్ణా జలాలు వస్తే ఫ్లోరైడ్ సమస్య తగ్గుతుంది. మంచినీరు వస్తుంది'

– పుట్టా చిన్న సుబ్బయ్య, రైతు, తురిమెళ్ల

ఎదురుచూపు.. ఉద్వేగం.. ఆనందం

● ట్రయల్ రన్‌లో ప్రజల పరిస్థితి

పెద్దదోర్నాల, న్యూస్‌టుడే: పూలసుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు జంట సొరంగాల్లో నుంచి కృష్ణా జలాలు ఫీడర్ కాలువకు చేరడంతో అక్కడ ఉన్న ఇంజినీరింగ్ అధికారులు, ప్రజా ప్రతినిధులు, ప్రజలు ఆనందంలో మునిగిపోయారు. వెలిగొండ ప్రాజెక్టులోకి కృష్ణా జలాలు పారించేందుకు ఆదివారం ట్రయల్ రన్ వేశారు. ఉదయం నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు కృష్ణా జలాలను చూసేందుకు ఎదురు చూశారు. నీరు రాగానే యువత కేకలు వేస్తూ సంతోషాన్ని పంచుకున్నారు. రెండో సొరంగం ముఖద్వారం, రెండు సొరంగాలు ఫీడర్ కాలువలో కలిసే ప్రదేశం, సీఎం ముఖ్యమంత్రి హారతి ఇచ్చే ప్రదేశంలో నీరు ప్రవహిస్తుంటే ఫొటోలు, సెల్ఫీలు దిగేందుకు ప్రజాప్రతినిధులు, మహిళలు, చిన్నారులు ఆసక్తి చూపారు. సొరంగాల్లో నీటి ప్రవాహాన్ని చూసి మా కష్టం ఫలించిందని ఇంజినీర్లు, కార్మికులు ఒకరినొకరు చేతులు కలుపుతూ ఆనందాన్ని పంచుకున్నారు.

సీఎం పర్యటన దృష్ట్యా ట్రాఫిక్ మళ్లింపు


డీఎస్పీ నాగరాజు

మార్కాపురం, న్యూస్‌టుడే: సీఎం చంద్రబాబునాయుడు మార్కాపురం జిల్లాలో ఈ నెల 31వ తేదీన పర్యటించనున్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలోని పలు ప్రాంతాల్లో నుంచి ట్రాఫిక్‌ను మళ్లించినట్లు పోలీసు అధికారులు చెప్పారు. ఆదివారం స్థానిక డీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో డీఎస్పీ యు.నాగరాజు మాట్లాడుతూ ఈ నెల 31న ఉదయం 5 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు వాహనాల దారి మళ్లింపు ఉంటుందన్నారు. నాలుగు మార్గాల్లో ట్రాఫిక్‌ను మార్పు చేసినట్లు తెలిపారు. నాలుగు మార్గాల్లో వాహనదారులు రాపోకలు సాగించాలని కోరారు. పోలీసు అధికారులకు సహకరించాలని డీఎస్పీ కోరారు. గుంటూరు నుంచి ఆత్మకూరు వెళ్లే వాహనదారులు గిద్దలూరు మీదుగా నంద్యాల వైపు వెళ్లి, అక్కడి నుంచి ఆత్మకూరు వెళ్లాలన్నారు. దేవరాజుగట్టు నుంచి చిన్న దోర్నాల వైపు వెళ్లే వాహనదారులకు రహదారి నిషేధించినట్లు చెప్పారు. శ్రీశైలం నుంచి వచ్చే, వెళ్లే వాహనాలు దోర్నాల టౌన్‌లోకి వెళ్లకుండా బైపాస్ రోడ్డు నుంచి రాకపోకలు జరపాలన్నారు. ఆత్మకూరు వైపు వెళ్లే వాహనదారులు గిద్దలూరు మీదుగా నంద్యాల వైపు వెళ్లి, అక్కడ నుంచి ఆత్మకూరు వైపు వెళ్లాలని సూచించారు. ఆత్మకూరు నుంచి గుంటూరు, శ్రీశైలం వైపు వెళ్లే వాహనదారులు నంద్యాల నుంచి గిద్దలూరు మీదుగా వెళ్లాలని సూచించారు.

నయన మనోహరం.. ముద్దసానమ్మ రూపం



మార్కాపురం మండలంలోని జమ్మనపల్లి-కోలభీ మునిపాడు గ్రామ శివారుల్లో వెలసిన శ్రీముద్దసానమ్మ దేవస్థానంలో శ్రావణ మాస ఆదివారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు అమ్మవారిని రంగురంగుల పుష్పాలతో విశేష అలంకరణలో భక్తులకు దర్శనం గావించారు. పట్టణ, సమీప గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. – న్యూస్‌టుడే, మార్కాపురం గ్రామీణం

పేదలకు ఆపన్నహస్తం అందించడమే 'మానవత' లక్ష్యం


ర్యాలీలో పాల్గొన్న సేవా సంస్థ ప్రతినిధులు

పొదిలి, న్యూస్‌టుడే: సమాజంలోని పేదలకు ఆపన్నహస్తం అందించి శాంతి, ప్రేమ, ఆనందం పంచాలన్నదే మానవత స్వచ్ఛంద సేవా సంస్థ లక్ష్యమని వ్యవస్థాపకుడు ఎన్.రామచంద్రా రెడ్డి అన్నారు. ఉమ్మడి ప్రకాశం జిల్లా మానవత శాఖల ఆధ్వర్యంలో ప్రపంచ శాంతిని కాంక్షిస్తూ పొదిలిలో ఆదివారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం కార్యాలయంలో జరిగిన జిల్లా నూతన కార్యవర్గ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కులమతాలు, పార్టీలకు అతీతంగా మానవతా సేవా సంస్థ రాష్ట్ర వ్యాప్తంగా 146 శాఖల ద్వారా సేవలందిస్తుందన్నారు. మానవతావాదులు, దాతలు ముందుకొచ్చి సంస్థ చేపట్టే సేవా కార్యక్రమాల్లో పాల్గొంటున్నారని చెప్పారు. పొదిలిశాఖ చేస్తున్న సేవా కార్యక్రమాలు రాష్ట్రానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని కొనియాడారు. ఏపీఆర్ గ్రూప్స్ అధినేత ఆవుల క్రిష్టారెడ్డి ఈ ఏడాది 105 మంది పేదలకు ఒక్కొక్కరికీ రూ.అయిదు వేల నిత్యవసరాలను అందించడం అభినందనీయమన్నారు. జిల్లా కార్యవర్గం చేత క్రిష్టారెడ్డి ప్రమాణ స్వీకారం చేయించారు. అధ్యక్షుడిగా ఎం.పార్థసారధి, ప్రధాన కార్యదర్శిగా ఎం.యేసోబు, కోశాధికారిగా ఎం.నరసింహారావు, ఉపాధ్యక్షుడిగా కె.రామిరెడ్డి, సంయుక్త కార్యదర్శిగా జి.వేణు, కార్యనిర్వహణ సభ్యులుగా డి.శ్రావణ్‌కుమార్, ఎం.సత్యనారాయణ, టి.రామిరెడ్డి, కె.చెన్నకేశవులు, ఉమ్మడి ప్రకాశం జిల్లా మహిళా అధ్యక్షురాలిగా వనజాక్షి ప్రమాణం చేశారు. పొదిలి మానవతశాఖ ఛైర్మన్ కె.నారాయణబాబు, మాజీ అధ్యక్షుడు కె.యల్లమందారెడ్డి, కన్వీనర్ కె.సుబ్బారెడ్డి, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.చిరంజీవి, వెంకటకృష్ణారావు, స్థలదాత వెలిశెట్టి వెంకటేశ్వర్లు, కోశాధికారి బి.అశోక్, మానవతాశాఖ ప్రతినిధులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం బోల్తాపడి వ్యక్తి దుర్మరణం

సీతారామపురం, సీఎస్‌పురం, న్యూస్‌టుడే: ద్విచక్రవాహనం అదుపుతప్పి బోల్తా పడటంతో ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా సీతారామపురం మండలంలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు... మార్కాపురం జిల్లా సీఎస్‌పురం మండలం నల్లమడుగుల ఎస్సీకాలనీకి చెందిన గుడిగుట్ల నారాయణ(47) బేల్దారీ మేస్త్రీగా పనిచేస్తుంటారు. ఆయన భార్య అంగన్‌వాడీ కార్యకర్తగా గ్రామంలో పనిచేస్తున్నారు. వారికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమార్తె వైఎస్సార్ కడప జిల్లా పోరుమామిళ్ల కేజీబీవీలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. కుమార్తెను ఇంటి వద్ద నుంచి ద్విచక్ర వాహనంపై పోరుమామిళ్లకు తీసుకెళ్లి పాఠశాలలో వదిలిపెట్టి స్వగ్రామానికి వస్తుండగా సీతారామపురం పంచాయతీ నారాయణప్పపేట వద్ద ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో నారయణ తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే మృతిచెందారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకటరాజేష్ తెలిపారు.

విద్యార్థులకు ఆలస్యంగా అల్పాహారం

● మంత్రి ఆగ్రహం


వసతి గృహంలో కింద కూర్చుని మాట్లాడుతున్న మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి

మార్కాపురం, న్యూస్‌టుడే: మార్కాపురం పట్టణంలోని సాంఘిక సంక్షేమ శాఖ బాలికల వసతి గృహంలో బాలికలకు ఉదయం అల్పాహారం ఆలస్యంగా పెట్టడంపై రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం మార్కాపురం- తర్లుపాడు రోడ్డులోని ఎస్సీ బాలికల వసతి గృహాన్ని మంత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన నేరుగా వెళ్లి విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వసతి గృహంలో అందుతున్న పౌష్టికాహారంతో పాటు సౌకర్యాలపై ఆరా తీశారు. కింద కూర్చుని సమస్యలను చెప్పాలని కోరారు. దీంతో విద్యార్థులు మంత్రి దృష్టికి పలు సమస్యలను తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు అల్పాహారం ఎందుకు ఆలస్యంగా పెట్టారని అధికారులను ప్రశ్నించారు. వసతి గృహంలో పారిశుద్ధ్య నిర్వహణ, విద్యార్థులకు సకాలంలో ఏకరూప దుస్తులతో పాటు ఇతర సామగ్రి ఇవ్వకపోవడంపై వసతి గృహ అధికారి, డీడీపై అసహనం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సాంఘిక సంక్షేమశాఖ అధికారి లక్ష్మానాయక్, అధికారులు పాల్గొన్నారు.

పోలీసు పహారాలో సీపీఎం కార్యాలయం

మార్కాపురం, న్యూస్‌టుడే: వెలిగొండ ప్రాజెక్టు ప్రారంభోత్సవానికి సీఎం చంద్రబాబు నాయుడు ఈ నెల 31వ తేదీన పర్యటిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం స్థానిక పూలసుబ్బయ్య వీధిలోని సీపీఎం కార్యాలయంపై పోలీస్ పహారా పెరిగింది. ఉదయం 5 గంటలకే పోలీసులు కార్యాలయానికి చేరుకుని నాయకులను బయటకు వెళ్లకుండా అడ్డుకున్నారు. బైండోవర్ చేశారు. వారితో నోటీసులపై సంతకాలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి దగ్గుపాటి సోమయ్య మాట్లాడుతూ 30 ఏళ్లుగా ప్రాజెక్టును పాలక పార్టీలు నిర్లక్ష్యం చేశాయన్నారు. ప్రాజెక్టును పూర్తి చేయడానికి, నిర్వాసితుల సమస్యల కోసం కేసులు, జైళ్లను లెక్కచేయకుండా అనేక ఉద్యమాలను నడిపించినట్లు చెప్పారు. ప్రాజెక్టు కోసం కమ్యూనిస్టులు అనేక సంవత్సరాలుగా పోరాటాలు చేసిన ఘనత వారికే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు డి.కె.ఎం.రఫీ, పి.రూబెన్, గుమ్మా బాలనాగయ్య, కె.మాల్యాద్రి, ఏనుగుల సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సాగర్ నీరొచ్చింది.. దాహార్తి తీరనుంది


85/3వ మైలు గేట్ల నుంచి జిల్లాలోకి ప్రవేశించిన సాగర్ జలాలు

త్రిపురాంతకం గ్రామీణం, న్యూస్‌టుడే: ఉమ్మడి ప్రకాశం జిల్లా తాగునీటి అవసరాల కోసం విడుదలైన సాగర్ జలాలు ఆదివారం త్రిపురాంతకం ఎన్నెస్పీ సబ్ డివిజన్‌లోకి ప్రవేశించాయి. తీవ్ర వర్షాభావంతో తాగునీటి ఎద్దడితో అల్లాడుతున్న మార్కాపురం, ప్రకాశం జిల్లాల ప్రజల దాహార్తి తీరనుంది.

సోమవారం కల్లా కురిచేడు సబ్ డివిజన్‌లోకి: మూడు రోజుల క్రితం బుగ్గవాగు వద్ద జలాలు విడుదల చేయగా శనివారం పల్నాడు జిల్లా చేజర్ల సమీపంలోని 57/2వ మైలు వద్దకు వచ్చాయి. అక్కడ షట్టర్లు ఎత్తడంతో ఆదివారం పల్నాడు-మార్కాపురం జిల్లాల సరిహద్దు 85/3వ మైలు నుంచి జిల్లాలోకి తొలుత 475 క్యూసెక్కుల సాగర్ జలాలు ప్రవేశించాయి. సాయంత్రానికల్లా ఆరడుగుల మేర ప్రవాహం 1,500 క్యూసెక్కులకు పెరిగింది. సోమవారం కల్లా త్రిపురాంతకం ఎన్నెస్పీ సబ్ డివిజన్ దాటి కురిచేడు సబ్ డివిజన్‌లోకి ప్రవేశిస్తాయని త్రిపురాంతకం ఎన్నెస్పీ సబ్ డివిజన్ డీఈఈ యు.విజయలక్ష్మి తెలిపారు. సాగర్ కుడి ప్రధాన కాలువ ద్వారా ఉమ్మడి జిల్లాకు రెండు వేల క్యూసెక్కుల చొప్పున 15 రోజుల పాటు సాగర్ జలాలు సరఫరా అవుతాయని ఒంగోలు ఎన్నెస్పీ ఇన్‌ఛార్జి ఎస్ఈ రవికుమర్ తెలిపారు.

అడుగంటిన తాగునీటి జలాశయాలు: కృష్ణానది ఎగువ పరివాహక ప్రాంతాల్లో అరకొర వానలు కురవడంతో వచ్చిన కొద్దిపాటి వరదకు శ్రీశైలం జలాశయం సైతం నిండలేదు. ఫలితంగా నాగార్జున సాగర్‌కు నీటి చేరిక నిలిచిపోవడంతో సాగునీటికి నోచుకోలేదు. ఖరీఫ్‌లోనూ వాన జాడ లేక, ఎండల తీవ్రత పెరగడంతో చెరువులు అడుగంటాయి. కొన్ని చెరువుల్లో 40 శాతం నీరుండగా, మరికొన్నింట్లో 25 శాతానికి మించి లేవు. ● ఎల్‌నినో తీవ్రత కొనసాగే అవకాశం ఉన్నందున రబీ సీజన్ వస్తున్నా చినుకు జాడ లేకపోవడంతో చెరువులు పూర్తిగా అడుగంటే ముప్పు ఉంది. 1.5 టీఎంసీల నీరు నిల్వ ఉండాల్సిన రామతీర్థం జలాశయంలో 0.16 నీరు ఉంది. డెడ్ స్టోరేజీకి చేరిన రామతీర్థంతో పాటు సాగర్ ప్రధాన కాలువపై ఉన్న తాగునీటి నిల్వ జలాశయాలను నీటితో నింపేందుకు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు చర్యలు చేపట్టారు.

తెలుగు బాప్టిస్ట్ చర్చి నూతన కార్యవర్గం ఎన్నిక


ఎన్నికైన కార్యవర్గ సభ్యులు

మార్కాపురం గ్రామీణం, న్యూస్‌టుడే: మార్కాపురం పట్టణంలోని ఏబీఎం కాంపౌండ్‌లో ఉన్న తెలుగు బాప్టిస్ట్ చర్చి నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు కార్యదర్శి ప్రభుదాస్ తెలిపారు. అధ్యక్షుడిగా తాతపూడి శామ్యూల్ జైపాల్, ఉపాధ్యక్షుడిగా కట్టే బెనహర రవికుమార్, కార్యదర్శిగా సంద్రపాటి ప్రభుదాస్, కోశాధికారిగా కోలా రఘుబాబు, సభ్యులుగా అబ్రహం, విజయకుమార్, శ్యామ్‌ను ఎన్నుకున్నట్లు వెల్లడించారు. యూత్ డైరెక్టర్‌గా దారివేముల హర్షిత బాబి, సండే స్కూల్ సూపరింటెండెంట్‌గా సువర్ణ, తదితరులను ఎన్నుకున్నారు. వీరు రెండేళ్ల పాటు కమిటీ సభ్యులుగా కొనసాగుతారని పేర్కొన్నారు.

బాలికల ఖోఖో జట్టు ఎంపిక

చీమకుర్తి, న్యూస్‌టుడే: ఉమ్మడి ప్రకాశం జిల్లా ఖోఖో సంఘం ఆధ్వర్యంలో జిల్లా జూనియర్ బాలికల ఖోఖో జట్టును చీమకుర్తిలో ఆదివారం ఎంపిక చేశారు. సుమారు 60 మంది క్రీడాకారిణులు హాజరయ్యారు. జిల్లా జట్టుకు ఎంపికైన వారు ఎన్టీఆర్ జిల్లా కంచికచర్లలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నారు. జిల్లా సంఘం అధ్యక్ష, కార్యదర్శులు వసంత రఘుబాబు, కరిచేటి హనుమంతరావు, పీడీ మండవ సౌజన్య పర్యవేక్షించారు. సీపీఎస్ ప్రధానోపాధ్యాయుడు రామాంజనేయులు, పీడీ రామకృష్ణ, శ్రీహరి, మురళి, వెంకట్ పాల్గొన్నారు.

యువకుల మృతిపై బంధువుల ఆందోళన


పవన్‌కుమార్‌రెడ్డి


జస్వంత్‌కుమార్‌రెడ్డి

కడప నేరవార్తలు, న్యూస్‌టుడే: కడప శివారులోని సింగ్‌పూర్ టౌన్‌షిప్ వద్ద శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో పవన్‌కుమార్‌రెడ్డి(21), జస్వంత్‌కుమార్‌రెడ్డి(22)లు మృతి చెందారు. మార్కాపురం జిల్లా, పుల్లలచెరువు మండలం ఉమ్మడివరం గ్రామానికి చెందిన పవన్‌కుమార్‌రెడ్డి నగరంలోని ఎస్వీ ఇంజినీరింగ్ కళాశాలలో ఇంజినీరింగ్ చదివేవారు. జస్వంత్‌కుమార్‌రెడ్డి హోమియోపతి కళాశాలలో ఆయుర్వేద వైద్యవృత్తినభ్యసించేవారు. వీరిద్దరూ ఊటుకూరు నుంచి నగరవనానికి ద్విచక్రవాహనంలో వెళ్లే క్రమంలో ఎదురుగా వస్తున్న కారు ఢీకొనడంతో శనివారం మృతి చెందిన విషయం తెలిసిందే.

ఎస్పీ కార్యాలయం వద్ద...

తమ కుమారుడి మృతిపై ట్రాఫిక్ సీఐ రెండు వైపులా మాట్లాడుతున్నారని, రోడ్డు ప్రమాదం చేసిన వ్యక్తిని అదుపులోకి తీసుకోలేదంటూ మృతుల తల్లిదండ్రులు సుబ్బారెడ్డి, ఉమా, హనుమంతురెడ్డి, కళావతి ఆరోపించారు. ఈ మేరకు ఎస్పీ కార్యాలయం ప్రధాన ద్వారం వద్ద మృతదేహాలతో ఆదివారం వారు ఆందోళన చేశారు. ఘటనా స్థలానికి ఇన్‌ఛార్జి డీఎస్పీ బాలస్వామిరెడ్డి, ఒకటో పట్టణ సీఐ తిమ్మారెడ్డి, ఎస్సైలు ప్రదీప్‌కుమార్, అమర్‌నాథ్‌రెడ్డి వచ్చి బాధితులతో మాట్లాడారు. అక్కడ నుంచి ఆందోళనకారులు డీఎస్పీ కార్యాలయానికి వెళ్లారు. రెండు రోజుల్లో విచారించి న్యాయం చేస్తామని చెప్పడంతో మృతదేహాలను తీసుకెళ్లారు.

రెండు కుటుంబాల్లో విషాదం


మరో ఆరుమాసాల్లో ఇరువురి విద్య పూర్తి అవుతుంది. ఇంతలో ఇద్దరూ మృతి చెందడంతో కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది. పవన్‌కుమార్‌రెడ్డి ఒక్కడే కొడుకు. అతని సోదరి అఖిలారెడ్డి లండన్‌లో చదువుతోంది. రెండు నెలల కిందటే పవన్‌కుమార్‌రెడ్డికి అఖిలారెడ్డి రూ.2.20 లక్షలు వెచ్చించి ద్విచక్ర వాహనం కొనిచ్చి ఆమె లండన్‌కు వెళ్లారు. కొద్ది నెలలకు ఇలా జరగడంతో అఖిలారెడ్డి కన్నీరుమున్నీరుగా విలపించారు. జస్వంత్‌కుమార్‌రెడ్డి తండ్రి హనుమంతరెడ్డి హైదరాబాదులో హోమియోపతి ఆసుపత్రి నిర్వహిస్తున్నాడు. చేతికొచ్చిన ఇద్దరు యువకులు మృతి చెందడంతో కుటుంబ సభ్యులు గుండెలవిసేలా రోదించారు.

సిమెంటు లోడు లారీ దగ్ధం.. తప్పిన ప్రమాదం


ప్రమాదంలో కాలిపోయిన లారీ

కంభం, న్యూస్‌టుడే : ద్విచక్రవాహనాన్ని తప్పించే క్రమంలో సిమెంటు లోడుతో వెళ్తున్న లారీ విభాగినిని ఢీకొనడంతో మంటలు చెలరేగిన సంఘటన కందులాపురం కూడలిలో శనివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. పల్నాడు జిల్లా దాచేపల్లి నుంచి బెంగళూరుకు సిమెంటు లోడుతో లారీ వెళ్తుండగా జూనియర్ కళాశాల వైపు నుంచి వేగంగా వచ్చిన ద్విచక్రవాహనాన్ని తప్పించే క్రమంలో లారీ డివైడర్‌ను ఢీకొంది. దాంతో టైర్లు పేలిపోయి పక్కనే ఉన్న విద్యుత్తు పరివర్తకాన్ని తగలడంతో మంటలు పెద్ద ఎత్తున వ్యాపించాయి. డ్రైవర్ కిందకి దూకేయడంతో ప్రమాదం తప్పింది. రహదారి పక్కనే ఇళ్ల ముందు నిలిపి ఉంచిన రెండు బైకులకు మంటలు వ్యాపించడంతో అవి పూర్తిగా కాలిపోయాయి. ఘటన స్థలానికి ఎస్సై శివకృష్ణారెడ్డి, సిబ్బంది వెంకటేశ్వర్లు చేరుకొని వెంటనే విద్యుత్తు సరఫరా ఆపించారు. అగ్నిమాపక శాఖ మంటలను అదుపు చేసింది. పోలీసులు ఘటన వివరాలు సేకరిస్తున్నారు.

ప్రకాశం జిల్లాలో బ్రాయిలర్ ధరలు (కిలో కి రూ.లలో)



వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం ధర - 112, రిటైల్ లైవ్ - 139, చికెన్ విత్ స్కిన్ - 215, చికెన్ స్కిన్‌లెస్- 243

EENADU Classifieds

BUSINESS SERVICES

బంగారం కొనబడును: బ్యాంకులలో, ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం విడిపించి అధిక ధరకు కొనబడును (స్పాట్ క్యాష్). ✆ 73311 65666

బంగారం బ్యాంకులలో / ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). ✆ 8142292071.

మధుసూదన్ ఆటోఫైనాన్స్ H.O లో పనిచేయుటకు టెలికాలర్స్-5, అకౌంటెంట్స్-2 కావలెను. ఆకర్షణీయమైన జీతం కలదు. ✆ 8886688938, 9246469894.

గుంటూరు మాస్టర్‌మైండ్స్ కాలేజి నందు వార్డెన్స్, హాస్టల్ ఇన్‌ఛార్జీస్‌గా పనిచేయుటకు పురుషులు కావలెను. జీతం 13000/- నుండి 16000/- వరకు ఇవ్వబడును. (ఉచిత భోజనము వసతి కల్పించబడును) విద్యార్హతలు: ఇంటర్, డిగ్రీ, వయస్సు 20 సంవత్సరములపైన ఉండవలెను. వివరములకు ✆ 9154693478.

EDUCATION

OPEN INTER ADMISSIONS GROUPS: MPC/BIPC/CEC KANDUKUR - 85550 94933, ONGOLE - 87126 95633

ప్రముఖ స్టార్ హోటల్ "గీతా రీజెన్సీ" నందు పనిచేయుటకు రుబ్బింగ్, కెప్టెన్స్, వెయిటర్స్, కిచెన్ అసిస్టెంట్స్, రూమ్ సర్వీస్ వెయిటర్స్, ఆర్డర్ టేకర్స్, హౌస్ కీపింగ్ బాయ్స్, కాఫీ స్టాల్, స్టోర్ కీపర్స్, రెస్టారెంట్ ఇంఛార్జి మరియు కన్‌స్ట్రక్షన్ సూపర్ వైజర్స్ వెంటనే కావలెను. అనుభవమును బట్టి ఆకర్షణీయమైన జీతం.సంప్ర.4/1, అరండల్‌పేట గుంటూరు. 9949077525.

JOBS

సురేష్ బుక్‌లింక్స్ ఒంగోలు నందు హోల్‌సేల్ (గూడం) బుక్‌షాపులో పనిచేయుటకు హెల్పర్స్ (యువకులు) కావలెను. (P.T/F.T) ఆకర్షణీయమైన జీతం. ✆ 94907 17572

SBI LIFE ఉద్యోగ అవకాశాలు నందు నియామకాలు జరుగుచున్నవి వయస్సు18 To 70 సం|| అర్హత 10వ తరగతి ఆపైన సంప్ర: 9640252922

అధిక స్పందనలు పొందండి. వాహనాలు అమ్మకం, ఉద్యోగాల భర్తీ, ఇళ్లు, ప్లాట్లు, స్థలాలు అమ్మకాలు, కొనుగోళ్లు, ఇళ్లు, షాపులు, ప్లాట్లు అద్దెకు మరియు అన్ని రకాల బిజినెస్ వ్యవహారాలు.. B/W 5 లైన్ల ప్రకటన రూ.275/- మాత్రమే

వివరాలకు..

97011 12824

ఒంగోలు 80087 09902

మార్కాపురం 80081 11050

మీ చిన్నారులకు పుట్టినరోజు శుభాకాంక్షలు ఈనాడు ద్వారా తెలపండి. B&W : రూ. 500 Colour : రూ. 700

ప్రకటనలపై 5% GST వర్తించును

SECURITY GUARDS

సెక్యూర్ సెక్యూరిటీ సర్వీసెస్: కొండెపి, టంగుటూరు ఏరియాలలో పనిచేయుటకు సెక్యూరిటీ SO లు, ASO లు, సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. ✆ 99595 98279

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తా పత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటన దారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయం లో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బు ను వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

